



ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం

వరి సాగు అంచనా 1.62 లక్షల హెక్టార్లు

- పంట రుణాల లక్ష్యం రూ.11,510 కోట్లు
- సబ్సిడీపై 11,600 క్వింటాళ్ల విత్తనాలు
- ఎరువుల అవసరం 89 వేల టన్నులు
- మట్టి పరీక్షల లక్ష్యం 21,711 నమూనాలు

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు వ్యవసాయశాఖ ప్రణాళికను సిద్ధం చేసింది. ఈఏడాది సమృద్ధిగా వర్షాలు కురుస్తాయనే సంకేతాన్ని వాతావరణశాఖ పంపింది. సకాలంలో వానలు కురిసి, వాతావరణం వరి సాగుకు అనుకూలంగా మారితే జూన్ రెండోవారం నుంచి జులై వరకు నారుమడులు పోసుకునేందుకు అవకాశం ఉంటుంది. జూన్‌లో వర్షాలు కురిసి, పంటకాల్వలకు సాగునీటిని సకాలంలో విడుదల చేస్తే ఖరీఫ్ అదునకు సాగుతుంది. వ్యవసాయశాఖ ద్వారా వరి విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేందుకు జిల్లా వ్యవసాయశాఖ 2025 ఖరీఫ్ ప్రణాళికను సిద్ధం చేసి పంపగా, ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం)

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 1,62,123 హెక్టార్లలో వరిసాగు జరుగుతుందని వ్యవసాయశాఖ అంచనా. చెరకు 3,549 హెక్టార్లలో, మినుము 1,340, వేరుశెనగ 724, పత్తి 298, ఇతర పంటలు 133 హెక్టార్లలో సాగు జరుగుతుందని అంచనా. ఈ ఏడాది 11,600 క్వింటాళ్ల వరి విత్తనాలను క్వింటాలుకు రూ.500 చొప్పు సబ్సిడీగా ఇవ్వాలని నిర్ణయించారు. 1.03 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవససరం కాగా, ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే విత్తనాలు కాకుండా సుమారుగా 90 వేల క్వింటాళ్ల విత్తనాలను రైతులు బహిరంగమార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి ఉంది. వ్యవసాయశాఖ ద్వారా బీపీటీ 5204, ఎంటీయూ 1061, ఎంటీయూ 1318 వంటి రకాల వరివిత్తనాలను అందించాలని నిర్ణయించారు. రైతులు ఎంటీయూ 1061, 1064, 1121, 7029, 1318, 1224, స్వర్ణ, బీపీటీ-5204, 3291 వంటి వరి వంగడాలను సాగుచేసేందుకు సంసిద్ధులవుతున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న భూమి పరిస్థితులు, భూసారం, పంటసాగు చేసే సమయం ఆధారంగా ఆయా గ్రామాల్లో వచ్చే సీజన్‌లో ఏ రకం వరివంగడాలను సాగు చేయాలనే అంశంపై మిగతా 6లో..

ఇసుక టెండర్ల లొల్లి



● సిండికేట్, స్థానిక సంస్థల మధ్య రగడ

- » పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల్లో నాలుగు క్వారీలకు టెండర్లు
- » స్థానికంగా ఉన్న సంస్థలే పాల్గొనాలని నిబంధన
- » బిడ్లు వేసిన పొరుగు రాష్ట్రాలకు చెందిన ఆరు సంస్థలు
- » న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్న స్థానిక సంస్థలు

కృష్ణాజిల్లాలో ఇసుక టెండర్ల వ్యవహారం దుమారం రేపుతోంది. పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల్లోని నాలుగు ఇసుక క్వారీలకు టెండర్లు ఆహ్వానించగా, పొరుగు రాష్ట్రాల నుంచి ఆరు సంస్థలు బిడ్‌లు వేశాయి. స్థానిక సంస్థలే పాల్గొనాలనే నిబంధనను అధికారులు పక్కన పెట్టి బిడ్‌లను పాస్ చేయించారు. అర్హతలేని సంస్థలకు అవకాశం ఇవ్వడంపై స్థానిక సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ వ్యవహారంలో సిండికేట్ నడుస్తోందని ఆరోపణలు గుప్పించాయి. జిల్లా యంత్రాంగం వాటికి అనుకూలంగా వ్యవహరించిందని విమర్శలు చేస్తున్నాయి. టెండర్లు ఖరారు కాగానే, హైకోర్టును ఆశ్రయించేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

కృష్ణాజిల్లాలో పామర్రు, పెనమలూరు నియోజకవర్గాల పరిధిలో నాలుగు ఇసుక క్వారీలకు జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు మైనింగ్ అధికారులు ఇటీవల టెండర్లు ఆహ్వానించారు. పామర్రు నియోజకవర్గం పరిధిలో రొయ్యూరు, నార్త్ వల్లూరు, లంకపల్లి క్వారీలకు, పెనమలూరు నియోజకవర్గంలో చోడవరం ఇసుక క్వారీకి టెండర్లు పిలిచారు. సగటున ఒక్కో క్వారీకి డజనుకు పైగా కాంట్రాక్టు సంస్థలు బిడ్‌లను వేశాయి. ప్రతి క్వారీలో కూడా స్థానికేతర కాంట్రాక్టు సంస్థలు బిడ్‌లను వేశాయి.

టెండరు నిబంధనల ప్రకారం ఇసుక టెండర్లలో పాల్గొనే సంస్థలు కృష్ణాజిల్లాకు చెందిన స్థానిక సంస్థలు అయి ఉండాలి. స్థానికత లేని సంస్థలు టెండర్లకు అర్హత సాధించవు. ఈ నిబంధనలను జిల్లా యంత్రాంగమే నిర్దేశించింది. కానీ అస్మదీయ సంస్థలకు మాత్రం ఈ నిబంధనల మినహాయింపు ఇవ్వటం గమనార్హం. దీంతో మొత్తం ఆరు రాష్ట్రేతర సంస్థలు కృష్ణాజిల్లా ఇసుక టెండర్లలో పాలు పంచుకున్నాయి. వీటిలో ఐదు వరకు హైదరాబాద్‌కు చెం దిన సంస్థలు కాగా, ఒకటి హుబ్లీకి చెందిన సంస్థగా ఉంది.

టెక్నికల్ బిడ్‌లు పాస్ చేయటంతో వివాదం

చోడవరం, రొయ్యూరు, నార్త్ వల్లూరు, లంకపల్లి క్వారీల్లో ఈ ఆరు సంస్థలు టెండర్లు వేశాయి. స్థానిక సంస్థలు కాకపోవటం వల్ల టెక్నికల్ బిడ్‌ల పరిశీలనలోనే వీటిని పక్కన పెట్టాల్సి ఉంటుంది. కానీ జిల్లా యంత్రాంగం ఆ పని చేయలేదు. మైనింగ్ అధికారులకు ఆ మేరకు డైరెక్షన్ ఇవ్వలేదు. స్థానికంగా లేకపోయినప్పటికీ టెక్నికల్ బిడ్‌లలో అర్హత సాధించినట్టుగా చూపారు. ఇక్కడే వివాదం తలెత్తింది. కృష్ణా జిల్లాకు చెందిన సంస్థలే టెండర్లు వేయాల్సి ఉండగా.. పొరుగు రాష్ట్రాల వారు టెండర్లలో పాల్గొన్నా కూడా పాస్ చేయటం వివాదాస్పదంగా మారింది. అధికారుల తీరు తీవ్ర ఆరోపణలకు దారి తీస్తోంది. ఆధార్ మిగతా 6లో..



గుడివాడ-గుడ్లవల్లేరు మధ్య రహదారి వెంబడి వేసిన 33 కె.వి విద్యుత్ లైన్, స్తంభాలు

సమన్వయ లోపం

● ఆర్ అండ్ బి, విద్యుత్ అధికారులకు కొరవడిన ముందుచూపు

● రహదారి వెంబడి 33 కె.వి.విద్యుత్ లైన్ ● పెడన - విస్సన్నపేట రహదారి విస్తరణకు డీపీఆర్ ఆమోదం
● పనులు ప్రారంభమైతే విద్యుత్ లైన్ తొలగించాల్సిందే ● రూ.1.50 కోట్లు బూడిదలో పోసిన పన్నీరే

విద్యుత్, ఆర్ అండ్ బీ అధికారుల సమన్వయ లోపం, ముందుచూపు లేకపోవడం రూ.కోట్ల ప్రజాధనం వృథా అయ్యే పరిస్థితికి దారితీసింది. త్వరలో విస్తరణ చేపట్టే పెడన - విస్సన్నపేట రహదారి వెంబడి మార్జిన్‌లో వేసిన విద్యుత్ స్తంభాలు, లైన్లే దీనికి ప్రత్యక్ష నిదర్శనం

(ఆంధ్రజ్యోతి - గుడివాడ)

అభివృద్ధి పనుల్లో భాగంగా అధికారులు తీసుకునే నిర్ణయాలు కొన్ని ఆశ్చర్యానికి గురి చేస్తాయి. అంతేకాదు కోట్ల ప్రజాధనం వృథాకు కారణమవుతాయి. పెడన - విసన్నపేట రహదారి విస్తరణకు డీపీఆర్ సైతం ఆమోదం పొందింది. ఈ రహదారి వెంబడి రూ.1.50 కోట్ల వ్యయంతో 13 కిలోమీటర్ల మేర 33 కె.వి విద్యుత్ లైన్‌లను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. విస్తరణ పనులు మొదలైతే విద్యుత్ లైన్‌లను తొలగించాల్సి ఉంది. తిరిగి కొత్తగా విద్యుత్ స్తంభాలు వేయడం, వైర్లు ఏర్పాటు చేయాలంటే మరో రూ.2 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ముందు చూపు లేకుండా చేస్తున్న పనుల వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి కోట్లలో నష్టం వాటిల్లుతుంది. రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడంతో రహదారి ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. రహదారి మార్జిన్‌కు కనీసం మీటర్లు దూరం కూడా లేకుండా స్తంభాలను ఏర్పాటు చేయడం గమనార్హం

గుడివాడ మండలం మల్లాయిపాలెం శివారు జగనన్నకాలనీలోని సబ్ స్టేషన్ నుంచి గుడ్లవల్లేరు మండలం కౌతవరంలోని సబ్ స్టేషన్ వరకు కొత్తగా 33 కె.వి విద్యుత్ లైన్ నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో గుడివాడ మండలం బొమ్ములూరు నుంచి కౌతవరం వరకు సుమారు 11 కిలోమీటర్ల మేర పెడన-విసన్నపేట అంతర్ రాష్ట్ర రహదారి వెంబడి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. అంతర్ రాష్ట్ర రహదారుల వెం బడి 33 కె.వి విద్యుత్ లైన్ కోసం రహదారి మార్జిన్‌కు ఆనుకుని స్తంభాలను ఏర్పాటు చేయడం వివాదాస్పదమైంది.

సమన్వయం లేకపోవడమే..

గతంలో ఆర్ అండ్ బి అధికారులు, విద్యుత్ అధికారులు సమన్వయంతో రహదారి మార్జిన్‌కు దూరంగా పొలాల్లో నుంచి 11 కె.వి విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇరు శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. రహదారి వెంబడి 11 కె.వి, 33 కె.వి విద్యుత్ స్తంభాలు పక్క పక్కనే ఉన్నాయి. ఎవరి ఆలోచన మేరకు ఏకంగా 33 కె.వి విద్యుత్ లైన్‌లను రహదారికి ఆనుకుని ఏర్పాటు చేశారనేది జవాబులేని ప్రశ్నగా మిగిలింది. పొలాలు, కాలువ గుండా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తే సగానికి పైగా ఖర్చు తగ్గుతుందని నిపుణులు తెలుపుతున్నారు. రహదారుల వెంబడి నిర్దిష్ట దూరం పాటిస్తూ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాల్సి ఉంది.



6లో

ఘంటసాల విగ్రహం వద్ద జెండా ఊపి హెరిటేజ్ వాక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్

ఘంటసాలలో హెరిటేజ్ వాక్

టూరు ఖరారు! 8లో

భయం..భయం

ప్రమాదకరంగా కొత్తమాజేరు వంతెన

చల్లపల్లి మండల పరిధిలో కొత్తమాజేరు గ్రామంలో గుండేరు (లింగన్నకోడు)పై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. జాతీయ రహదారి నుంచి కొత్తమాజేరు గ్రామంలోకి ఈ వంతెన మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. మాజేరుతోపాటు చిన్నాపురం, భోగిరెడ్డిపల్లి, నెలకుర్రు, పెదయాదర, చినయాదర తదితర గ్రామాలకు సైతం ఈ వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెనపై ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- విరిగిపోయిన రెయిలింగ్‌లు
- కుంగుతున్న వంతెన అప్రోచ్ రహదారి
- ఆందోళన చెందుతున్న ఐదు గ్రామాల ప్రజలు



గుండేరుపై రెయిలింగ్‌లు విరిగిపోయి, అప్రోచ్ కుంగి ప్రమాదకరంగా ఉన్న వంతెన

(ఆంధ్రజ్యోతి-చల్లపల్లి)

కొత్తమాజేరు వద్ద గుండేరు (లింగన్నకోడు)పై ఉన్న వంతెనకు ఇరువైపులా రెయిలింగ్‌లు విరిగిపోయాయి. గతంలో పలుమార్లు మరమ్మతులు చేసినప్పటికీ రెయిలింగ్‌లు దెబ్బతిన్నాయి. వంతెన ఉండే నాలుగు గోడలు పూర్తిగా దెబ్బతిని మలుపులు ప్రమాదకరంగా మారాయి. వంతెనకు ఇరువైపులా ఉన్న అప్రోచ్ రహదారి కుంగి ప్రమాదకరంగా త యారైంది. తారురోడ్డు కుంగి గోతులు ఏర్పడుతున్నాయి. ఆదమరిచి ద్విచక్ర వాహనదారులు వచ్చినా, రాత్రివేళ ప్రయాణమైనా గోతుల్లో వంతెన ఎక్కటం ప్రమాదకరమే. ఓవైపు రెయిలింగ్‌లు దెబ్బతిని, మరోవైపు వంతెన అప్రోచ్ రోడ్డుకు గోతులతో వంతెన ప్రమాదాలకు నెలవుగా మారింది. వంతెన దిగువ గోడలు సైతం ఒకటి రెండు పగుళ్లిచ్చారు. నిత్యం వందలాది వాహనాలు, ట్రాక్టర్లు, ఆటోలు, లారీల రాకపోకలతో రద్దీగా ఉండే వంతెనను పటిష్టపరచాల్సిన అవసరం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు నిర్వహించటంతోపాటు దీర్ఘకాలిక ప్రయోజనాల నిమిత్తం వంతెన విస్తరణపైనా దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొత్త వంతెన నిర్మిస్తాం

మచిలీపట్నం ఆర్ అండ్ బి ఏఈ పి.సురేష్‌ను వివరణ కోరగా, కొత్త వంతెన నిర్మాణానికి రూ.ఐదు కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నాబార్డు ద్వారా నిధులు మంజూరైతే కొత్త వంతెన నిర్మాణం జరుగుతుందన్నారు.



మీ ఊరికి రండి!

- ◆ ఉషా వాన్స్‌కు సాయిపురం గ్రామవాసుల ఆహ్వానం
- ◆ టైట్ షెడ్యూల్ వల్ల ఏపీకి రాలేని పరిస్థితి
- ◆ మరోసారి ప్రత్యేకంగా కృష్ణాజిల్లాకు ఆహ్వానిస్తామని చెబుతున్న బంధువులు
- ◆ ఉషా వాన్స్ రాక కోసం సాయిపురం ఎదురుచూపులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

కృష్ణాజిల్లా అల్లుడు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సతీమణి చిలుకూరి ఉషా వాన్స్ రెండు రోజుల భారతదేశ పర్యటనకు వచ్చారు. ఉషా వాన్స్ స్వగ్రామం అయిన ఉయ్యూరు మండలం సాయిపురం గ్రామస్థులు మాత్రం 'మీ ఊరు రండి' అంటూ ఆమెకు విజ్ఞప్తులు చేస్తున్నారు. ఉషా వాన్స్ మూలాలు సాయిపురం గ్రామంలోనే ఉన్నాయి. ఉషావాన్స్ తాతయ్య అయిన చిలుకూరి బుచ్చిపాపయ్య శాస్త్రిది సాయిపురం గ్రామం. 1970లోనే ఉషా వాన్స్ తండ్రి చిలుకూరి రాధాకృష్ణ, తల్లి లక్ష్మి అమెరికాకు వలస వెళ్లారు. దీంతో ఉషా బాల్యం, విద్యాభ్యాసం అంతా అక్కడే సాగింది. ఆమె పూర్వీకులు ఎవరూ ఇప్పుడు సాయిపురంలో లేరు. అమెరికా ఉపాధ్యక్షుడి సతీమణి కావటంతో ఆమె పేరు మారుమోగిపోయింది. ఉషా వాన్స్ ఇండియాకు రావటంతో ఆమెను చూడటానికి సాయిపురం గ్రామస్థులు 'మీ ఊరు రండి' అంటూ పిలుస్తున్నారు. అయితే ఉషావాన్స్ ఇండియాలో కేవలం రెండు రోజుల షెడ్యూల్ ఉండటంతో సాయిపురం వచ్చే అవకాశం లేదని సాయిపురం గ్రామ వాసి (ప్రస్తుతం విజయవాడలో ఉంటున్నారు) చిలుకూరి మిగతా 6లో..



స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు కౌముది దంపతులకు అందజేస్తున్న ఆలయ పర్యవేక్షకులు

సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో క్యాట్ సభ్యులు

మోపిదేవి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని విశ్రాంత డీజీపీ, క్యాట్‌సభ్యులు వివిఎస్‌కె.కౌముది సోమవారం సాయంత్రం దర్శించుకున్నారు. అధికారులు, అర్చక బృందం కౌముది దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయ పర్యవేక్షకులు మధుసూదనరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.



హెరిటేజ్ వాక్‌లో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, గ్రామ ప్రముఖులు

ఘంటసాలలో హెరిటేజ్ వాక్

ఘంటసాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : తెలుగు జాతి హృదయాలను తాకిన అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కొనియాడారు. ఘంటసాల గ్రామంలో గాన కచేరి చేసి 58 ఏళ్లు పూర్తయిన సందర్భంగా హెరిటేజ్ వాక్‌ను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. మార్కెట్ ఎదురుగా ఉన్న ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, పక్కనే ఉన్న గౌతమ బుద్ధుని విగ్రహం వద్ద బౌద్ధ భిక్షువు బంతేజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వెంకటేశ్వరరావు పూర్వీకులది ఘంటసాల గ్రామం కావటం, ఘంటసాల ఈ ప్రాంతానికి రావటం అదృష్టమన్నారు. అలాంటి మహోన్నతమైన వ్యక్తిని గుర్తు చేసుకుని హెరిటేజ్ వాక్ నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు. ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ఘంటసాల వెంకటేశ్వరరావు విడిది చేసిన ఇంటి వరకు హెరిటేజ్ వాక్ కొనసాగింది. జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ నిర్వహించిన కార్యక్రమంలో ఎన్ఆర్ఐ వేమూరి రాజేష్, కూటమి నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాసవారీ భద్రతా అవార్డులు అందుకుంటున్న ఉద్యోగులు

రైల్వే ఉద్యోగులకు భద్రతా అవార్డులు

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రైల్వే డివిజన్ ఉద్యోగులు ముగ్గురికి మార్చినెలకుగాను భద్రతా అవార్డులు లభించాయి. సికింద్రాబాద్ రైల్వే నిలయంలో సోమవారం జరిగిన వర్చువల్ భద్రతా సమీక్షా సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఈ అవార్డులను అందజేశారు. సమావేశంలో విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్, సికింద్రాబాద్ రైల్ నిలయం ముఖ్య అధికారులు, గుంతకల్లు, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల మేనేజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ జైన్ భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఉద్యోగులు అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకున్నందుకు అభినందించారు. దెందులూరు స్టేషన్ సూపరింటెండెంట్ టి.వి.ఎం.యు. మహేశ్వర్, రాజమండ్రి పాయింట్స్‌మెన్ కె.నథానియేల్, రాజమండ్రి రైలు మేనేజర్ లోకేష్ కుమార్‌లకు సేఫ్టీ మంత్ అవార్డులను అందజేశారు.

చంద్రబాబును గుండెల్లో పెట్టుకుని పూజిస్తున్నా

» ఎమ్మెల్యే వెనిగండ్ల



అట్లాంటాలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ఆరాధ్య దైవం అయితే, ముఖ్యమంత్రి చంద్రబాబును గుండెల్లో పెట్టుకుని పూజిస్తున్నానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలను అట్లాంటాలోని కమ్మింగ్ ఎన్టీఆర్ స్టాట్యూ 2450 మౌంటెన్ రోడ్డులోని అట్లాంటా స్టేట్ ఎన్ఆర్ఐ టీడీపీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను ప్రవాసాంధ్రులతో కలిసి వెనిగండ్ల కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశ రాజకీయాల్లో చంద్రబాబుకు సాటి వచ్చే వ్యక్తి కేవలం మోదీ మాత్రమేనని, ప్రపంచస్థాయి నగరంగా అమరావతి నిర్మాణానికి చంద్రబాబు కంకణం కట్టుకున్నారన్నారు. ప్రవాసాంధ్రులు పీ-4లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న సీపీ రాజశేఖర్‌బాబు, చిత్రంలో సురక్ష నరసయ్య

మహిళల ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

» విజయవాడ సీపీ రాజశేఖర్‌బాబు

పెనమలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మహిళా పోలీసు సిబ్బంది పని ఒత్తిడిలో పడి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని విజయవాడ సీపీ రాజశేఖరబాబు అన్నారు. సోమవారం కానూరు 'టాప్ స్టార్' ఆసుపత్రిలో సురక్ష ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ కేవీ నరసయ్య ఆధ్వర్యంలో ఆసుపత్రి ఎండీ తాతినేని శ్రీనివాస్ సహకారంతో మహిళా పోలీసు సిబ్బందికి నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో సీపీ పాల్గొని మాట్లాడారు. మహిళలు కేన్సర్‌పై అవగాహన లేక నిర్లక్ష్యం చేసి ప్రాణం మీదికి తెచ్చుకొంటారని.. అందువల్ల సిబ్బందికి ఒకరోజు క్యాంపు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు తెలిపారు. 'టాప్‌స్టార్' యాజమాన్యం, సురక్ష నరసయ్యకు సీపీ అభినందనలు తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళా పోలీసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సురక్ష నరసయ్య మాట్లాడుతూ, సీపీ సూచన మేరకు అన్నివర్గాల వారికి మరిన్ని క్యాంపులు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. విశాఖ డెయిరీ ఆంజనేయులు మాట్లాడుతూ, కేన్సర్ వ్యాక్సిన్ డొనేట్ చేస్తామని తెలిపారు. వైద్య శిబిరంలో సుమారు 350మంది మహిళా పోలీసు సిబ్బందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కేన్సరు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో డీసీపీ కేజీవీ సరిత, ట్రైనీ ఐపీఎస్ మనీషా, ఏసీపీ స్రవంతిరాయ్, మహిళా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ బాలాజీ

కోర్టు కేసులపై దృష్టి సారించండి

» 24న జిల్లా సమీక్షా సమావేశం

» కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కోర్టుకేసుల విషయంలో అలసత్వం లేకుండా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని, అలా చేయని అధికారులపై చర్యలు తీసుకుంటామని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ అన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక(మీకోసం) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కోర్టుకేసులను పట్టించుకోకుండా కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వాయిదాకు ముందురోజు స్పందిస్తున్నారని, ఇది సరైనపద్ధతి కాదన్నారు. కలెక్టర్ కోర్టుకు హాజరయ్యే పరిస్థితిని తీసుకురావద్దన్నారు. ఇలాంటి అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగులందరికీ ఈహెచ్‌సీ పథకం అమలయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఈనెల 24న జరగనున్న జిల్లా సమీక్షా సమావేశానికి నివేదికలను పంపాలని అధికారులను ఆదేశించారు. మీకోసం అర్జీల పరిష్కారంలో జిల్లా అట్టడుగున ఉండటం విచారకరమన్నారు. వివిధ ప్రాంతాల ప్రజలనుంచి 201 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, మెప్మాపీడీ సాయిబాబు, పౌరసరఫరాలసంస్థ జిల్లా మేనేజర్ పద్మావతి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

దివ్యాంగులకు ప్రభుత్వ ఫలాలు అందాలి

మచిలీపట్నం టౌన్ : దివ్యాంగులకు ప్రభుత్వ ఫలాలు అందాలని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ అన్నారు. సోమవారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, నడక కర్రలు పంపిణీ చేశారు. 132 మందికి రూ.15,63,218 విలువ గల పరికరాలను అందించినట్లు సమగ్ర శిక్ష అధికారి ముదిగొండ ధూర్జటి ఈ సందర్భంగా తెలిపారు.

అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అర్జీల పరిష్కారంలో జాప్యాన్ని సహించబోమని, జవాబుదారీతనంతో అర్జీలను పరిష్కరించాలన్న ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేందుకు అధికారులు కృషిచేయాలని కలె



కలెక్టర్ లక్ష్మీశకు ప్రజాసమస్యలు వివరిస్తున్న సీపీఎం నేతలు

క్టర్ లక్ష్మీశ ఆదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశతో ఎండను సైతం లెక్కచేయక ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి అర్జీలను సమర్పిస్తున్నారన్నారు. వారి ఆశలను వమ్ము చేయకుండా జవాబుదారీతనంతో అర్జీలను పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో జాప్యాన్ని సహించేది లేదని ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీఆర్డీఏ పీడీ ఏఎన్‌వి నాంచారరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

కలెక్టరేట్ : దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ఆరుగురు దివ్యాంగ విద్యార్థులకు కలెక్టర్ లక్ష్మీశ ల్యాప్‌టాప్‌లు, వినికిడి యంత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలను



దివ్యాంగుడికి ల్యాప్‌టాప్ అందిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

అందజేసి విద్యారంగంలో మరింత ఉన్నతస్థాయికి చేరేలా చర్యలు తీసుకొంటున్నామన్నారు. జిల్లాలో ఆరుగురు డిగ్రీ విద్యార్థులకు రూ.35 వేల విలువైన ల్యాప్‌టాప్‌లను, ఓ విద్యార్థికి రూ.3,500 విలువగల వినికిడి యంత్రాన్ని అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు వి.కామరాజు, డీఆర్డీఏ పీడీ ఏఎన్‌వి నాంచారరావు, అధికారులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు భద్రత

కలెక్టరేట్ : మహిళల భద్రతను మరింత మెరుగుపరిచేలక్ష్యంతో 'శక్తి' యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, 1930 టోల్ ఫ్రీతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసి నేరాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ సందర్భంగా అవగాహన పోస్టర్లను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల రక్షణ లక్ష్యంగా ప్రభుత్వం శక్తి యాప్‌ను రూపొందించడం జరిగిందన్నారు. యాప్‌లో వన్‌టచ్ బటన్ క్లిక్ చేస్తే పోలీసులు తక్షణమే స్పందిస్తారన్నారు. యాప్‌లో ఫిర్యాదుల నమోదు, పోలీసు అధికారుల వివరాలు, వాట్సాప్ గవర్నెన్స్, భద్రతతో కూడిన ప్రయాణం, అత్యవసర కాంట్రాక్ట్ నంబర్స్ వంటి అత్యాధునిక ఫీచర్స్‌ను పొందుపరచడం జరిగిందన్నారు. సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు 1930 టోల్ ఫ్రీ నెంబరును అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు.

ఆర్టీసీలో పదోన్నతులకు అనుమతివ్వాలి

» ఈయూ డిమాండ్

బస్‌స్టేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ఆర్టీసీలో వివిధ హోదాల్లో ఉన్న సుమారు మూడువేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జి.వి.నరసయ్యలు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంస్థలో పదోన్నతుల జాప్యంతో సుమారు 80 మంది అధికారులు వివిధ హోదాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఇన్‌చార్జ్‌లుగా పనిచేస్తు పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సీనియారిటీ ప్రకారం ఉద్యోగులు, అధికారులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.



చల్లపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ కృష్ణకుమారితో మహిళా సర్పంచ్‌లు

స్వచ్ఛ చల్లపల్లిని సందర్శించిన మహిళా సర్పంచ్‌లు

చల్లపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ చల్లపల్లి గ్రామాన్ని మహిళా సర్పంచ్‌లు సందర్శించారు. ఆర్థిక సమతా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్.సత్యనారాయణ నేతృత్వంలో మదనపల్లికి చెందిన ఫౌండేషన్ ఎకలాజికల్ సెక్యూరిటీ సంస్థ ద్వారా అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందిన 30 మంది మహిళా సర్పంచ్‌లు చల్లపల్లి వచ్చారు. దశాబ్ధకాలంగా చల్లపల్లిలో జరుగుతున్న స్వచ్ఛ ఉద్యమాన్ని, గణనీయంగా మారిన గ్రామరూపురేఖల గురించి తెలుసుకున్నారు. స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డీఆర్కే ప్రసాద్‌ను కలిసి స్వచ్ఛ కార్యక్రమ విశేషాలు తెలుసుకోగా, పదేళ్ల ఉద్యమ ప్రస్థానాన్ని వారికి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. చల్లపల్లి గ్రామ పంచాయతీని సందర్శించి సర్పంచ్, ఈవోలతో సమావేశమై రోజువారీ చెత్తసేకరణ, సంపద తయారీ, పారిశుధ్య నిర్వహణ గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్టు మేనేజర్ రాణీదేవి, సదాశివరావు, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈవో పీవీ మాధవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఆర్థిక సమతా మండలి కార్యకలాపాలను సత్యనారాయణ వారికి తెలియజేశారు.

మీ ఊరుకు రండి!

(5వ పేజీ తరువాయి)

రామ్మోహనరావు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. రామ్మోహనరావు ఉషా వాన్స్ తాతయ్య అయిన రామశాస్త్రి చిన్న సోదరుడు. చాలా టైట్ షెడ్యూల్ ఉందని, ఈ కారణంగా ఏపీకి రాలేకపోతున్నారని తెలిపారు. ముఖ్య బంధువులు చెన్నైలో ఉన్నారు. ఉషా వాన్స్ మేనత్త శారద అక్కడే ఉన్నారు. ఆమెను కూడా చూడలేని పరిస్థితి నెలకొంది. విశాఖపట్నంలో ప్రొఫెసర్‌గా పనిచేసిన శాంతమ్మ ఉషా వాన్స్‌కు అమ్మమ్మ వరుస అవుతారు. ఆమెకు ఇప్పుడు 96 సంవత్సరాలు. వీరందరినీ చూడటానికి రావచ్చనుకున్నా.. టైట్ షెడ్యూల్ వల్ల వీలుపడటం లేదని తెలుస్తోంది. మరో ప్రత్యేక సందర్భం చూసుకుని తాము ఉషా వాన్స్‌ను కృష్ణాజిల్లాకు తీసుకురావటానికి ఆహ్వానం పలుకుతామని చిలుకూరు రామ్మోహనరావు వివరించారు.

ఇసుక టెండర్ల లొల్లి

(5వ పేజీ తరువాయి)

కార్డును తాత్కాలికంగా మార్చుకున్నంతమాత్రాన స్థానికుడు అయిపోరు. అతని రేషన్ కార్డు కూడా స్థానికంగా ఉండాలి. ఆ ప్రాంతంలో బియ్యం తీసుకుంటూ ఉండాలి. అప్పుడే ఆ ఆధార్ కార్డుకు సార్థకత ఉంటుంది. ఇసుక టెండర్లలో పొరుగు రాష్ట్రాలకు చెందిన ఆరు సంస్థలు కూడా జీఎస్టీని తాత్కాలికంగా స్థానిక అడ్రస్‌తో మార్చించుకున్న మాత్రాన ఆ సంస్థ ఎక్కడ రిజిస్ట్రేషన్ అయిందన్నది ప్రధానమైన విషయం. పొరుగు రాష్ట్రాల్లో సంస్థను రిజిస్ట్రేషన్ చేయించుకుని అక్కడ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ స్థానిక సంస్థలని చెప్పుకోవటమే విడ్డూరం. మైనింగ్ అధికారులు మాత్రం ఆ సంస్థల రిజిస్ట్రేషన్ చూడకుండా కేవలం జీఎస్టీ అడ్రస్‌లనే ప్రాతిపదికగా తీసుకుని టెక్నికల్ బిడ్‌లలో పాస్ చేయటం తీవ్ర ఆరోపణలకు దారి తీస్తోంది.

ఆ ఆరు సంస్థలు సిండికేట్‌గా ఏర్పడ్డాయా?

పొరుగు రాష్ట్రాలకు చెందిన ఆరు సంస్థలు కూడా సిండికేట్ అయినట్టుగా ఆరోపణలు వస్తున్నాయి. కృష్ణాజిల్లాకు చెందిన బిడ్డర్లు వీటిపై జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. సిండికేట్ సంస్థలన్నీ నీకు ఈ క్వారీ, నాకు ఆ క్వారీ అని పంచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆరు సంస్థలు కూడా క్వారీలను దక్కించుకునేందుకు వీలుగా అవగాహనతో టెండర్లు వేశాయన్న విమర్శలు వస్తున్నాయి. ముందుగా అనుకున్న ప్రకారం ఆ సంస్థలకు అవకాశం కల్పించేందుకు మైనింగ్ అధికారులు, జిల్లా యంత్రాంగం కలిసి స్థానిక సంస్థలు కాకపోయినా కూడా టెక్నికల్ బిడ్‌లలో పాస్ చేసినట్టు తెలుస్తోంది.

కోర్టును ఆశ్రయించనున్న జిల్లా సంస్థలు

టెండర్ల నిబంధనలకు విరుద్ధంగా పొరుగు రాష్ట్రాలకు చెందిన సంస్థలను తిరస్కరించకుండా టెక్నికల్ బిడ్‌లలో వాటిని పాస్ చేయటంపై కృష్ణాజిల్లాకు చెందిన పలు సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించబోతున్నాయి. టెండర్లు ఖరారు కాగానే ఆధారాలతో సహా కేసు వేసేందుకు సిద్ధం చేసుకోవటం గమనార్హం. ఇప్పటికే లాయర్‌ను పిలిపించుకుని మరీ కేసు గురించి చర్చించినట్టు సమాచారం.

ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం

(5వ పేజీ తరువాయి)

వ్యవసాయశాఖ ముందస్తుగానే ప్రణాళికను తయారు చేసి గ్రామాల్లో ఈ విషయాన్ని తెలియజేస్తూ రైతు సేవా కేంద్రాల వద్ద, ప్రధాన కూడళ్లలో గోడలపై రాసి రైతులకు తెలియజేస్తారు.

మట్టి నమూనాల సేకరణ

2024-25 సంవత్సరంలో 16,400 మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు నిర్వహించారు. ఈ ఏడాది 21,711 మట్టి నమూనాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మే నెలాఖరు నాటికి మట్టి నమూనాలను సేకరించి, జూన్ నెలాఖరు నాటికి భూసార పరీక్షల వివరాలను రైతులకు అందజేయనున్నారు. ఇందుకోసం గుడివాడ మార్కెట్ యార్డులో జిల్లా స్థాయి భూసార పరీక్షా కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నెలాఖరు నాటికి ఈ కేంద్రంలో భూసార పరీక్షలు ప్రారంభమవుతాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

2,486 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

భూసారాన్ని పెంచేందుకు, రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు జిల్లాలో 2,486 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను 50 శాతం సబ్సిడీపై రైతులకు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జనుము, జీలుగ విత్తనాలు నాలుగు కేజీలు, పిల్లిపెసర రెండు కేజీల బ్యాగుల చొప్పున ఎంపిక చేసిన రైతులకు అందజేస్తారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రూ.3.01 కోట్ల విలువైన ట్రాక్టర్‌లు, రోటో వేటర్‌లు, స్ప్రేయర్‌లు ఇతత్రా పరికరాలను 50 శాతం సబ్సిడీపై అందజేస్తారు. జిల్లాలోని 25 మండలాల్లోని 35 రైతుగ్రూపులకు పంటలకు పురుగుమందులు పిచికారీ చేసేందుకు 35 డ్రోన్‌లను అందజేయనున్నారు. ఒక్కో డ్రోన్ ధర రూ.10లక్షలు కాగా రూ.8 లక్షలను సబ్సిడీగా అందజేయనున్నారు. ఈ ఏడాది కౌలు రైతులకు 70,500 సీసీ ఆర్‌సీ కార్డులను అందజేయాలని నిర్ణయించారు.

89 వేల టన్నుల ఎరువులు అవసరం

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 89 వేల టన్నుల ఎరువులను వినియోగిస్తారని వ్యవసాయశాఖ అధికారుల అంచనా. ఇందులో యూరియా 30 వేల టన్నులు, డీఏపీ 10వేల టన్నులు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ నాలుగు వేల టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 30 వేల టన్నులు, సూపర్ ఫాస్పేట్ ఏడు వేల టన్నులు అవసరమని, ఈ ఎరువులను అందుబాటులో ఉంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

పంట రుణాల లక్ష్యం రూ.11,510కోట్లు

జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించి రైతులకు రూ.11,510 కోట్లను రుణాలుగా ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో పంట రుణాలు రూ.7,513 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.3,997 కోట్లు ఇచ్చేలా ప్రణాళికను రూపొందించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తరువాత పంట రుణాల మంజూరులో కొద్దిపాటి మార్పులు, చేర్పులు చేసే అవకాశం ఉంది.

కాల్వలకు సకాలంలో నీరిస్తేనే..

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట కాల్వలకు సాగునీటిని విడుదల చేయడంపైనే వ్యవసాయపనులు ప్రారంభించడం ఆధారపడి ఉంది. కాల్వల ద్వారా వచ్చే నీటితోపాటు, వర్షాలు సకాలంలో కురిస్తేనే వ్యవసాయ పనులు ముందుకు సాగుతాయి. జూన్‌లోగా పంట కాల్వలు, డ్రెయినేజీల్లో పూడికతీత పనులను చేయించాల్సి ఉంది. ఇంత వరకు ఈ పనులకు ఆమోదం లభించలేదు.

30లోగా ఈకేవైసీ చేయించుకోవాలి

» జేసీ గీతాంజలిశర్మ

మచిలీపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌కార్డులో పేరు ఉన్న ప్రతిఒక్కరూ ఈనెల 30లోగా ఈకేవైసీ చేయించుకోవాలని జేసీ గీతాంజలిశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌షాపులు, ఎండీయూ ఆపరేటర్లు, డిప్యూటీ తహసీల్దార్‌లు, తహసీల్దార్లు, పౌరసరఫరాల అధికారి కార్యాలయాల్లో ఈకేవైసీ చేయించేందుకు అవకాశం ఉందని ఆమె అన్నారు. మచిలీపట్నం డివిజన్‌లో 30,983, గుడివాడ డివిజన్‌లో 19,421, ఉయ్యూరు డివిజన్‌లో 20,706, జిల్లామొత్తంగా 71,110 కార్డుదారులు ఈకేవైసీ చేయించాల్సి ఉందన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు, 80 సంవత్సరాలు దాటిన వారికి ఈకేవైసీ నుంచి మినహాయింపు ఉందన్నారు.

12మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేత

కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగం పొందిన వారు ప్రజలకు సేవ చేసేందుకు చొరవ చూపాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. జిల్లాలో వివిధ విభాగాల్లో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబసభ్యులు 12 మందికి ఈ నియామకపత్రాలను కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం కలెక్టర్ అందజేశారు. ఎనిమిది మందికి జూనియర్ అసిస్టెంట్లుగా, ఒకరికి సచివాలయకార్యదర్శిగా, ముగ్గురిని ఆఫీస్ సబార్డినేట్‌లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అవనిగడ్డ డీఎస్పీ టి.విద్యశ్రీ

ఆరుగురు లాటరీ నిర్వాహకుల అరెస్ట్

చల్లపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సింగిల్ నెంబర్ లాటరీ జూద నిర్వహణపై కఠిన చర్యలు తీసుకుంటామని అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ స్పష్టం చేశారు. జూదాన్ని కొనసాగిస్తే పీడీ యాక్ట్ నమోదు చేసి నగర బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. సోమవారం చల్లపల్లి స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాలతో డీఎస్పీ పర్యవేక్షణలో చల్లపల్లి సీఐ, స్పెషల్ టీమ్‌ల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి చల్లపల్లి ప్రాంతంలో లాటరీ జూదం నిర్వహిస్తున్న పసుపులేటి లీలా ప్రసాద్, మహమ్మద్ మస్తాన్(చినబాబు), ముచ్చు రామసుబ్బారావు, పఠాన్ ఫరీద్‌బాబా, మెండు వీరబాబు, కుంభా నాగమల్లేశ్వరరావు(చమురు)లను అరెస్ట్‌చేశామన్నారు. రూపాయికి రూ.60 ఇస్తామని ఆశ చూపి ప్రజల నుంచి డబ్బులు వసూలుచేసి మోసం చేస్తున్నారని, ఇందుకోసం కొంతమంది బుకీలను నియమించుకున్నట్టు తెలిపారు. 19 మందిపై కేసు నమోదు చేసి రెండు ఫోన్లు, రూ.7900 నగదు, ఐదు లాటరీ పేపర్లు సీజ్ చేశామన్నారు. ఆరుగురిపై గతంలో లాటరీ కేసులతోపాటు క్రిమినల్ కేసులు ఉన్నందున మువ్వ కోర్టులో హాజరు పరచనున్నట్టు చెప్పారు. చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఎస్ఐ పీఎస్‌వి. సుబ్రహ్మణ్యం సిబ్బంది పాల్గొన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా, 14 రోజుల రిమాండ్ విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

» మరొకరికి తీవ్ర గాయాలు



తాడంకి రాకేష్ (ఫైల్)

గుడివాడ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రూరల్ మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన తాడంకి రాకేష్ (19) ద్విచక్ర వాహనం నడుపుతూ అదుపు తప్పి ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో సోమవారం ఉదయం మృతిచెందినట్టు రూరల్ ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపారు. స్నేహితుడు వరుణ్ తేజ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై చౌటపల్లి వెళుతుండగా, శ్యామాలాంబ రైసుమిల్లు వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, రాకేష్ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. వరుణ్ తేజ్ పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. రాకేష్ తండ్రి రెండేళ్ల క్రితం మృతి చెందగా.. రాడ్ బెండింగ్ చేస్తూ కుటుంబభారం మోస్తున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని ముఠా కార్మికుడు..

విద్యాధరపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నల్లకుంట సెంటర్ సమీపంలో ద్విచక్ర వాహనం ఢీకొనటంతో ముఠా కార్మికుడు తంగెళ్లమూడి శ్రీనివాస్ రవికుమార్ (51) మృతి చెందిన ఘటనపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. విజయవాడ రూరల్ సూరాయపాలెంలో తంగెళ్లమూడి శ్రీనివాస్ రవికుమార్ భార్య ఆదిలక్ష్మితో ఉంటున్నాడు. వీరికి సంతానం లేదు. రవికుమార్ గొల్లపూడి మహాత్మాగాంధీ హోల్‌సేల్ మార్కెట్‌లో ముఠా కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 6 గంటలకు జూపిటర్ వాహనంపై తుమ్మలపాలెం వెళ్లి చేపలు కొనుగోలు చేసి ఇంటికి బయలుదేరాడు. నల్లకుంట సమీపంలోని ముత్తవరపు వెంకటేశ్వరరావు గెస్ట్ హౌస్ వద్ద మలుపు తిరుగుతుండగా ఇబ్రహీంపట్నం వైపు నుంచి అతివేగంగా వచ్చిన ద్విచక్ర వాహనదారుడు రవికుమార్‌ను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో రవికుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు బాధితుడిని చికిత్స నిమిత్తం గొల్లపూడిలోని ఆంధ్రా హాస్పటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడి భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	124, 133, 144
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420	

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించడంతో పాటు సకాలంలో కూలి అందేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు బర్రె లెనిన్ డిమాండ్ చేశారు. సోమవారం బండారుగూడెంలో పనిచేస్తున్న ఉపాధి కూలీల సమస్యలను సీపీఐ నాయకులతో కలిసి అడిగి తెలుసుకున్నారు. పనిచేసే చోటులో మంచి నీరు, ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేశారా లేదా అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు హరనాథ్ పాల్గొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సీపీఐ, సీపీఎం నాయకులు

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్


యనమలకుదురు డొంక రోడ్డులో డ్రెయిన్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. యనమలకుదురు డొంకరోడ్డులో రూ. 60 లక్షల సాధారణ నిధులతో చేస్తున్న అభివృద్ధి పనులను సోమవారం ఎమ్మెల్యే బోడె అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల్లో నాణ్యత, ఎంతకాలంలో పనులు పూర్తవుతాయి.. లాంటి విషయాలను అధికారులతో చర్చించారు. వీలయినంత త్వరలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, అనంతనేని ఆజాద్, పాదాల ప్రభాకర్, జనసేన నాయకులు వడ్డి జీవా తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌వోల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

వైద్యఆరోగ్య శాఖ ఎన్‌హెచ్ఎం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ద్వారా ప్రజారోగ్య వ్యవస్థలో నాణ్యమైన సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం అసోసియేషన్ తరఫున ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. 2019 నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని ఉప కేంద్రాల్లో బీఎస్సీ నర్సింగ్ పట్టభద్రులను కమ్యూనిటీ హెల్త్ అధికారులుగా నియమించారని, ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్న తమకు ఆరేళ్లుగా ఉద్యోగ భద్రత, ఆర్థిక భద్రత లేకుండా పోయిందని వినతిపత్రంలో వాపోయారు. ఏడు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, క్లినిక్ అద్దె బకాయిలు చెల్లించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పని ఆధారిత ప్రోత్సాహకాల క్రమబద్ధీకరణ, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ, ఈపీఎఫ్ఓ పునరుద్ధరణ సమస్యలపై పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏపీఎంసీఏ సంఘం ప్రతినిధులు ఝాన్సీ, మాధురి, పుష్పలత, అశోక్, నౌషద్, అంజలి తదితరులు ఉన్నారు.


గీతామందిరంలో నిర్వహిస్తున్న శ్రీనివాస కల్యాణం

సానుకూల ఆలోచనలతో జీవితాన్ని గడపాలి

● వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి

విజయవాడ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వ్యక్తి సానుకూల ఆలోచనలతో జీవితాన్ని గడపాలని భగవంతునిపై విశ్వాసం ఉంచాలని ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి అన్నారు. నున్నలోని గీతా మందిరంలో మూడు రోజుల పాటు జరిగిన మహా సంప్రోక్షణ, కుంభాభిషేకం కార్యక్రమాలు సోమవారం ఘనంగా ముగిశాయి. కార్యక్రమంలో భాగంగా శ్రీనివాస కల్యాణం, మహాదాశీర్వచనంతో పాటు అగ్ని ధ్యానం, మిత హోమం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిపూర్ణాందగిరి స్వామితో పాటుగా ఉత్తరాధికారి అనంగానందగిరి స్వామి వేద పండితులు రొంపిచర్ల రత్నకుమార్ హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ జరిగింది. ఈ కార్యక్రమానికి విజయవాడ రూరల్ తహసీల్దార్ బి. సుగుణ, నున్న పోలీసు స్టేషన్ సీఐ కృష్ణమోహన్, గీతా మందిరం భక్త బృందం పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్ : స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ అర్చకులు చక్రావధానుల సీతా రామాచార్యులు పర్యవేక్షణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మూర్తి విగ్రహానికి కుంభావాహనలు ఘనంగా నిర్వహించారు. అనంతరం వేద పండితులు వేదమంత్రాల నడుమ అగ్ని ప్రతిష్ట, మూలమంత్ర హోమాలు నిర్వహించారు. పలువురు మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో హోమాన్ని ఆచరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీలు కాకాని అరుణ, తవ్వా విజయలక్ష్మి పాల్గొన్నారు.



గన్నవరంలో నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

కేవీపీఎస్ నిరసన

గన్నవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం నియోజకవర్గంలో దళిత కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేయడానికి నిరసనగా సోమవారం గన్నవరంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్లో నిలబడి దళితులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. అభివృద్ధి చెందుతున్న సమాజంలో ఇంకా దళితులపై చిన్నచూపు, కుల బహిష్కరణలు వంటి కార్యక్రమాలు జరగడం సిగ్గుచేటు అని కేవీపీఎస్ నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నియోజక వర్గంలో దళితుల బహిష్కరణ జరగడం, దానికి ఆయన బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళ్లం రాంబాబు, ఏసుదాసు, ఆంథోని, గుండిమెడ ఉదయ భాస్కర్‌రావు, మిరప నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి

కంకిపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎ.ఎస్.బసవయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బందితో సోమవారం తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అదే విధంగా శిశు సంక్షేమ శాఖ అధికారు లతో పోషణ పక్వాడ ప్రొగ్రాం సంబంధించిన సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


గొర్రెలకు నట్టల నివారణ టీకాలు ప్రారంభిస్తున్న సర్పంచ్ అట్ల నాగేశ్వరరావు

నట్టల నివారణకు టీకాలు

గన్నవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మూగజీవాల సంరక్షణ కోసం నట్టల నివారణ టీకాలు మేలు చేస్తాయని సర్పంచ్ అట్ల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని సావరగూడెంలో కేసరపల్లి ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాలు సోమవారం వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ, గొర్రెలు, మేకలకు గ్రామాల్లో జీవాలకు టీకాలు వేయడం అభినందనీయమన్నారు. డాక్టర్ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, మూగజీవాల్లో అంతర పరాన్న జీవులను నివారిస్తే వాటి పెరుగుదల వేగంగా సాగుతుందన్నారు. ముస్తాబాద పశువైద్య కేంద్రం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ మేరీ వైడూర్యం, డాక్టర్ జి.కమలాకర్, డాక్టర్ భవనం సుధాకర్‌రెడ్డి, డాక్టర్ బిందు, కిరణ్మయి, టీడీపీ నాయకులు చీమలదండు రామకృష్ణ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో ప్రవేశం కల్పించాలి

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఉచిత నిర్బంద విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ విద్యా సంస్థల్లో 25 శాతం పేద విద్యార్థులకు 1వ తరగతిలో ప్రవేశం కల్పించాలని బాపులపాడు ఎంఈవో రాంబాలసింగ్ తెలిపారు. సోమవారం ప్రైవేట్ విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

అధికారులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం పట్టణంలోని డ్రెనేజీ సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. డ్రెనేజీ సమస్య మొత్తానికి శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. క్లోజ్ సీసీ డ్రైన్స్ నిర్మాణానికి ఎస్టిమేట్లు తయారు చేయాలన్నారు. నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా గ్రీనరీ, డ్రెయిన్లు, రోడ్ల అభివృద్ధికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణం అంతా పర్యటించి హైవే నుంచి గ్రామంలోకి రోడ్ల అనుసంధానం, హైవేకి ఇరువైపులా ఉన్న డ్రెయిన్లను శుభ్రం చేయించి గ్రీనరీ ఏర్పాటు చేసి గన్నవరాన్ని మోడల్ పంచాయతీ అయ్యేలాగా అధికారులు సమష్టిగా కృషి చేయాలన్నారు. గ్రామంలోని వీధులన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రిటైర్డ్ పీఆర్ ఈఈ అక్కినేని వెంకటేశ్వరరావు, విజయకుమార్‌లు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ కేవీ శివయ్య, ఎంపీడీవో టి.స్వర్ణలత, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బీ ఏఈలు సుజాత, బలరాం, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.


ఉయ్యూరులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ బాలాజీ

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

కలెక్టర్ డీకే బాలాజీ

ఉయ్యూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వైద్యులకు సూచించారు. ఉయ్యూరులో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సోమవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో బెడ్‌లు, ఇతర వైద్యసేవల గురించి చికిత్స పొందుతున్న రోగులను ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రంలో విద్యుత్ సమస్యను వైద్యాధికారిణి నాగస్వరూప కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఏపీసీపీడీసీఎల్ డిపార్ట్‌మెంట్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. అభివృద్ధి కమిటీ చైర్మన్ మండవ జయదేవ్, జబర్లపూడి సర్పంచ్ శేష వరప్రసాద్, తహసీల్దార్ సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.


అనుకీర్తికి నియామకపత్రం అందజేస్తున్న సర్పంచ్ కసుకుర్తి రంగామణి

కారుణ్య నియామకం అభినందనీయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విధులు నిర్వహిస్తూ మృతిచెందిన ఉద్యోగి కుటుంబానికి ఇచ్చే కారుణ్య నియామకాలను చేయడం కుటుంబాన్ని ఆదుకోవడమేనని ఎనెస్సీ ఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. సింగన్నగూడెం వీఆర్ ఎగా విధులు నిర్వహిస్తూ డిసెంబరులో మరణించిన నక్కా శివన్నారాయణ కుమార్తెకు కారుణ్య నియా మకంగా తాత్కాలిక ప్రాతిపదికన సింగన్నగూడెం వీఆర్‌ఏగా తహసీల్దార్ మురళీకృష్ణ ఇచ్చిన ఉత్తర్వులను సోమవారం ఆమెకు సర్పంచ్ కసుకుర్తి రంగామణి ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బెజవాడ వెంకట కృష్ణారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తుమ్మల ధశర దరామయ్య, పల్లగాని వీరాంజనేయులు, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

ఉయ్యూరు, ఏప్రిల్ 21 (ఆంధ్ర జ్యోతి) : పోషకాహార పక్షోత్స వాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యాన ఉయ్యూరు నగర పంచాయతీ పరిధిలో మహిళలకు సోమవారం సామూహిక సీమంతం ఘనంగా నిర్వహించారు. నగర పంచాయతీ కార్యాలయం వద్ద జరి గిన కార్యక్రమానికి చైర్మన్ వి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై 25 మంది గర్భిణులకు చీర, సారె, పసుపు కుంకుమ పంపిణీ చేశారు. మురళీకృష్ణ ట్రస్టుకు చెందిన జయ, సూపర్‌వైజర్ బేబీసరోజినీ నగర పంచాయతీ కమిషనర్ పి వెంకటేశ్వరరావు, ఎంఎస్ఎ అనూష, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రావణి, కౌన్సిలర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు : మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సీమంతాల కార్యక్రమంలో కంకిపాడు ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి పాల్గొన్నారు. ఆయన ట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా సీఎం చంద్రబాబు నాయుడు చూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

పెనమలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్న ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిగడప మహాగణపతినగర్‌కు చెందిన శంకరరావు కరెంట్ గాడుల పని చేస్తాడు. ఒక సంవత్సరం కిందట తాడిగడప కోకాకోలా కంపెనీ వద్ద సొంతిల్లు నిర్మించుకున్నాడు. అప్పటి నుంచి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. షుమారు ఇరవై లక్షల వరకు అప్పులు పేరుకుపోయాయి. ఆదివారం ఉదయం భార్యను ఆమె పనిచేసే రెస్టారెంట్ వద్ద దింపి ఇంటికి వెళ్లి బెడ్ రూంలో ఫ్యానుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. ఇది గమనించిన వారి బంధువులు గమనించి భార్య గౌతమికి ఫోన్‌ద్వారా తెలిపి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



విజేతలను అభిందిస్తున్న ప్రిన్సిపాల్ శివనాథ్, సత్యనారాయణ

ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌కు ఉయ్యూరు విద్యార్థుల ఎంపిక

ఉయ్యూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ కృష్ణాయూనివర్సిటీ జట్టుకు ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 19, 20 తేదీల్లో శ్రీకృష్ణవేణి డిగ్రీ కళాశాలలో జరిగిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల సాఫ్ట్‌బాల్ పోటీలు బాలుర విభాగంలో విజయం సాధించి ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు కృష్ణా విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికయ్యారు. మే 4 నుంచి 8వ తేదీ వరకు నెల్లూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో జరుగునున్న ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌కు కళశాల విద్యార్థులు జె కార్తీక్, కె సుభాశ్, ఎమ్ కుమార్‌రాజా, వై వీరవాసు. ఎస్ గణేశ్ ఎంపిక కాగా కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ చంద్రబాబు అభినందించారు.

సామాజిక అభివృద్ధికి దోహదపడే ఆవిష్కరణలు రూపొందించాలి

ఉంగుటూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తమలో అంతర్గతంగా దాగివున్న సృజనాత్మకతను బయటకు తీసి, ఉన్నతమైన ఆలోచనలతో సామాజిక అభివృద్ధికి, పరిశ్రమల అవసరాలకు దోహదపడే ఆవిష్కరణలు రూపొందించాలని గస్నెట్ అకాడమీ అకడమిక్ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ పి.మంజునాథ్, రానిట్రానిక్స్ అండ్ ప్రాక్టీస్ వ్యవస్థాపకులు వై.విజయశ్రీకుమార్ సూచించారు. ప్రపంచ సృజనాత్మకత అండ్ ఆవిష్కరణ (వరల్డ్ క్రియేటివిటీ అండ్ ఇన్నోవేషన్ డే) దినోత్సవం సోమవారం మండలంలోని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన మంజునాథ్, విజయశ్రీకుమార్‌లు ఈ సందర్భంగా విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన సందేశాలు ఇచ్చారు. టీ అండ్ పీ సెల్ హెడ్ సాగర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సందేశమిస్తున్న అతిథులు మంజునాథ్, విజయశ్రీకుమార్


విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్ చిప్పల దాసు

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

కంకిపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు పాఠశాల ఉపాధ్యాయులు కృషి చేయాలని మద్దూరు సర్పంచ్ చిప్పల దాసు అన్నారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సోమవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మండల స్వప్న, ఎంపీటీసీ శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ చిప్పల కీర్తి, వైస్ చైర్మన్ కూనపరెడ్డి సునీత పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడికి జరిమానా

ఉంగుటూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తిపై దాడిచేసి గాయపరిచిన కేసులో నిందితుడికి గన్నవరం కోర్టు జరిమానా విధించింది. ఉంగుటూరు ఎస్సై యు.గోవిందు తెలిపిన వివరాల ప్రకారం.. చాగంటిపాడుకు చెందిన పూల సాంబశివరావు అనే కౌలురైతు అప్పికట్ల శ్రీనివాసరావుకు చెందిన భూమిని కౌలుకు చేస్తున్నాడు. 2023లో పొలంలో నాట్లువేశాడు. అతని కుమారుడికి ఆరోగ్యం బాగోక ఆస్పత్రులు చుట్టూ తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో భూ యజమాని కోతకొచ్చిన పంటను కోసి, నూర్పిడి చేస్తుండగా సాంబశివరావు అడ్డుకున్నాడు. దీంతో శ్రీనివాసరావు తన చేతిలో వున్న కొడవలితో కుడిచేయి నరికడంతో తీవ్ర గాయమైంది. బాధితుడి అప్పటి ఏఎస్సై ఎన్.డి.నాగేశ్వరరావు కేసు నమోదు చేశారు. గన్నవరం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి బి.శిరీష నిందితుడైన శ్రీనివాసరావుకి రూ.8వేలు జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

టూరు ఖరారు!


ఇంద్రకీలాద్రి


మోపిదేవి

బ్రాండ్ టూరిజం ప్యాకేజీలను ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ఖరారు చేసింది. ప్యాకేజీ ధరలను మాత్రం ఇంకా నిర్ణయించలేదు. విజయవాడ నగరానికి వచ్చే సందర్శకులు మూడు నుంచి నాలుగు రోజుల వరకు ఇక్కడే ఉండిపోవటానికి అనుగుణంగా రెండు ప్యాకేజీలకు శ్రీకారం చుట్టింది. మూడు రోజుల టూర్ ప్యాకేజీ, నాలుగు రోజుల టూర్ ప్యాకేజీలను రూపొందించింది. ఈ ప్యాకేజీలను సరసమైన ధరలకు కల్పించనుంది. ఇప్పటికే ట్రాన్స్‌పోర్ట్, హోటల్స్ వంటి సంస్థలతో రాయితీ పద్ధతిన ధరలు కల్పించేలా మాట్లాడటం జరిగింది. అధికారికంగా ఈ పర్యాటక ప్యాకేజీలను అతి త్వరలోనే అమలు చేయనున్నారు.


ఆంధ్రజ్యోతి, విజయవాడ

ఎన్టీఆర్ జిల్లా బ్రాండ్ టూరిజం ప్యాకేజీలకు శ్రీకారం

- ఉమ్మడి కృష్ణా ప్రాంతాల సమ్మిళితంతో 3,4 రోజుల ప్యాకేజీలు
- త్వరలో అధికారికంగా అమల్లోకి తీసుకురానున్న అధికారులు

మూడు రోజుల ప్యాకేజీ ఇలా..

మొదటిరోజు బందర్ రోడ్‌లోని ఏపీ టీడీసీ సీఆర్‌వో ఆఫీస్ దగ్గరికి పర్యాటకులు రావాల్సి ఉంటుంది. ఇక్కడ నుంచి ప్రత్యేక బస్సులో పర్యటకులను హరిత బెరం పార్కుకు తీసుకు వెళ్తారు. అక్కడ అల్పాహారం అందిస్తారు. కొద్దిసేపు గడిపిన తర్వాత కనకదుర్గమ్మ గుడికి తీసుకువెళ్తారు. ఉపాలయాల సందర్శన, నగర పనోరమిక్ వ్యూ పూర్తయ్యాక అక్కడి నుంచి 76 కిలోమీటర్ల దూరంలో ఉన్న వేదాద్రి శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ సందర్శనం ఉంటుంది. అక్కడి విశేషాలు చూసిన తర్వాత 20 కిలోమీటర్ల దూరంలోని ముక్త్యాల శ్రీ ముక్తేశ్వర స్వామి దేవస్థానానికి తీసుకువెళతారు. ఈ చారిత్రక దేవాలయాన్ని సందర్శించిన తర్వాత 15 కిలోమీటర్ల దూరంలోని తిరుమలగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి తీసుకువెళతారు. అక్కడి నుంచి 15 కిలోమీటర్ల దూరంలోని పెనుగంచిప్రోలు శ్రీ లక్ష్మీతిరుపతమ్మ దేవస్థానానికి తీసుకువెళ్తారు. అమ్మవారి దర్శనం తర్వాత 36 కిలోమీటర్ల దూరంలోని నెమలి శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయానికి తీసుకువెళతారు. దర్శనానంతరం అక్కడ నుంచి 50 కిలోమీటర్ల దూరంలోని పుట్రేల మారెమ్మ దేవాలయానికి తీసుకువెళతారు. మారెమ్మ దర్శనం తర్వాత 76 కిలోమీటర్లు ప్రయాణించి తిరిగి విజయవాడ వస్తారు. రెండోరోజు విజయవాడ నుంచి 14కిలోమీటర్ల దూరంలోని వెంకటాయపాలెం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయానికి తీసుకువెళ్తారు. అక్కడి నుంచి 30 కిలోమీటర్ల దూరంలో అమరావతిలో ఉన్న శ్రీ అమరలింగేశ్వర స్వామి దేవస్థానానికి తీసుకువెళతారు. అమరలింగేశ్వర స్వామిని దర్శించుకున్న తర్వాత ధ్యాన బుద్ధ, కాలచక్ర, ఇతర బౌద్ధారామ విశేషాలు తిలకించిన తర్వాత 36 కిలోమీటర్ల దూరంలోని పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవాలయానికి తీసుకువెళ్తారు. అక్కడ శివపార్వతులను దర్శనానంతరం 17 కిలోమీటర్ల దూరంలోని మంగళగిరి శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి తీసుకువెళతారు. స్వామి దర్శనం తర్వాత పానకం స్వీకరణ, పరిసర ప్రాంతాల సందర్శన ఉంటుంది. ఇక్కడ నుంచి 20 కిలోమీటర్ల దూరంలోని యనమలకుదురు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం సందర్శన ఉంటుంది. అక్కడ కొండపై పరమేశ్వర దర్శనం తర్వాత కొండ పైనుంచి విజయవాడ సైట్ సీయింగ్ ఉంటుంది. తర్వాత 8 కిలోమీటర్ల దూరంలోని మాచవరం శ్రీ దాసాంజనేయ స్వామి దర్శనం తర్వాత 7 కిలోమీటర్ల దూరంలో కృష్ణా హారతి ఇచ్చే దుర్గా ఘాట్‌కి తీసుకువెళతారు. కృష్ణాతీరం అందాల వీక్షణతోపాటు కృష్ణాహారతి సందర్శన ఉంటుంది. రెండో రోజు మొత్తం 72 కిలోమీటర్ల మేర పర్యటన ఉంటుంది. ఇక మూడో రోజు విషయానికి వస్తే మొత్తం 72 కిలోమీటర్ల పాటు యాత్ర సాగుతుంది. విజయవాడ నుంచి ప్రారంభమై 55 కిలోమీటర్ల దూరంలోని మొవ్వ శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ సందర్శన ఉంటుంది. అక్కడి నుంచి 11 కిలోమీటర్ల దూరంలోని శ్రీకాకుళం ఆంధ్రమహావిష్ణు దేవస్థానానికి తీసుకువెళతారు. అక్కడ నుంచి 21 కిలోమీటర్ల దూరంలోని మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయాన్ని చూపిస్తారు. అక్కడ నుంచి 28 కిలోమీటర్ల దూరంలోని హంసలదీవికి తీసుకెళతారు. కృష్ణానది సముద్రంలో కలిసే ఈ ప్రాంతం అత్యద్భుతంగా ఉంటుంది. అక్కడి నుంచి 40 కిలోమీటర్ల దూరంలోని మచిలీపట్నం దగ్గర్లోని మంగినపూడి బీచ్‌కు తీసుకెళ్తారు. అక్కడి నుంచి 12 కిలోమీటర్ల దూరంలోని చిలకలపూడి పాండురంగ స్వామి దేవాలయ సందర్శన ఉంటుంది. దీంతో మూడో రోజు 72 కిలోమీటర్ల యాత్ర పూర్తవుతుంది.


కొండపల్లి


వేదాద్రి


వెంకటాయపాలెం


భవానీ ఐలాండ్

4 రోజుల ప్యాకేజీ ఇలా..

ఈ ప్యాకేజీ కూడా విజయవాడ ఏపీటీడీసీ సీఆర్‌వో కార్యాలయం నుంచి ప్రారంభమవుతుంది. పర్యాటకులను ప్రత్యేక బస్సులో నేరుగా కనకదుర్గమ్మ దేవస్థానానికి తీసుకువెళ్తారు. అమ్మవారి దర్శనం తర్వాత 22 కిలోమీటర్ల దూరంలోని కొండపల్లి కోటకు తీసుకువెళ్తారు. కొండపల్లి కోట సందర్శన తర్వాత 11 కిలోమీటర్ల దూరంలోని ఇబ్రహీంపట్నం ఫెర్రీ ఘాట్ వద్ద పవిత్రసంగమానికి తీసుకువెళ్తారు. ఇక్కడ కృష్ణానది అందాలతో పాటు దూరాన ఉన్న రాజధాని, కృష్ణా, గోదావరి సంగమం ప్రాంతాలను వీక్షించవచ్చు ఇక్కడ నుంచి 15 కిలోమీటర్ల దూరంలోని భవాని ఐలాండ్‌కు వస్తారు. కృష్ణానదిపై బోటువిహారం చేస్తూ భవానీ ద్వీపంలోకి చేరుకుంటారు. ద్వీప సందర్శన తర్వాత తిరిగి 5 కిలోమీటర్ల దూరంలోని విజయవాడ బాపు మ్యూజియం సందర్శనం ఉంటుంది. అక్కడి నుంచి 5 కిలోమీటర్ల దూరంలోని గాంధీ హిల్‌కు తీసుకు వెళతారు. అక్కడి నుంచి 4 కిలోమీటర్ల దూరంలోని అంబేద్కర్ స్మృతివనం ప్రాజెక్టు వద్దకు తీసుకువెళతారు. అంబేద్కర్ మ్యూజియం, ఆయన జీవిత చరిత్ర తెలుసుకోవచ్చు. తిరిగి బెర్మ్ పార్కుకు చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస ఉంటుంది. రెండో రోజు ఉదయాన్నే బయలుదేరి వేదాద్రి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం, ముక్త్యాల శ్రీ ముక్తేశ్వర స్వామి దేవాలయం, తిరుమలగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ సందర్శన చేసి నగరానికి తిరిగి వస్తారు. మూడో రోజున విజయవాడ నుంచి వెంకటాయపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, అమరావతి టెంపుల్ మ్యూజియం, బుద్ధ స్తూపం సందర్శన ఉంటాయి. ఇక్కడ నుంచి 33 కిలోమీటర్ల దూరంలోని ఉండవల్లి గుహల సందర్శనం అక్కడి నుంచి 30 కిలోమీటర్ల దూరంలోని మంగళగిరి ఎకోపార్కు సందర్శన ఉంటుంది తర్వాత 3 కిలోమీటర్ల దూరంలోని మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం సందర్శన ఉంటుంది స్వామిని దర్శించుకున్న తర్వాత 16 కిలోమీటర్ల దూరంలోని పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవాలయం సందర్శన ఉంటుంది. అక్కడి నుంచి విజయవాడకు చేరుకుంటారు. రాత్రి బస ఇక్కడే ఉంటుంది. తిరిగి 4వ రోజు ఉదయం విజయవాడ నుంచి 57 కిలోమీటర్ల దూరంలోని ఘంటసాల బౌద్ధ స్తూపం, మ్యూజియం సందర్శన, అక్కడ నుంచి 15 కిలోమీటర్ల దూరంలోని మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయం, మచిలీపట్నం, పెడన కలంకారి దుకాణాలకు తీసుకువెళతారు. అక్కడ పర్యాటకులు షాపింగ్ చేసుకోవచ్చు. అక్కడి నుంచి 19 కిలోమీటర్ల దూరంలోని మంగినపూడి బీచ్‌కు తీసుకువెళ్తారు. తర్వాత తిరిగి విజయవాడ తీసుకొస్తారు. ఇలా నాలుగు రోజు యాత్ర ముగుస్తుంది.


అమరావతి


చిన్నరాజగోపురం ఎదురుగా టెన్‌సైల్ షెడ్ నిర్మాణం

దుర్గగుడిలో వేగంగా టెన్ సైల్ షెడ్

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా భక్తుల సౌకర్యార్థం ఈవో, దేవదాయ శాఖ కమిషనర్ కే రామచంద్ర మోహన్ కొండపై చిన్న రాజగోపురం ఎదురుగా టెన్‌సైల్ షెడ్ నిర్మాణ పనులు చేపట్టారు. ప్రతి ఏడాది దసరా, భవానీ దీక్షలు, వివిధ పండగలు, వేసవిలో చిన్న రాజగోపురం ఎదురుగా ఉన్న ఖాళీస్థలం తాత్కాలిక షెడ్లు, పందిళ్లు వేసి భక్తులకు వసతులు కల్పిస్తున్నారు. అదేప్రదేశంలో శాశ్వతంగా షెడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సుమారు రూ.2.4 కోట్లతో టెన్ సైల్ షెడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఈ పనులను వేగవంతంగా చేపట్టి త్వరగా భక్తులకు అందుబాటులోకి తీసుకురావటానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్‌ను స్వాగతించిన ఏఐవైఎఫ్

గాంధీనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధానకార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు స్వాగతించారు. పరీక్షల గడువు కనీసం 70 రోజులు పెంచాలని కోరారు. స్థానిక దాసరిభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 30వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ అభ్యర్థుల వయో పరిమితిని 47 ఏళ్లకు పెంచాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలన్నారు. అభ్యర్థులకు టెన్త్, ఇంటర్‌లో 50 శాతం పాస్ పర్సంటేజ్ ఉండాలనే నిబంధనను సవరించాలని డిమాండ్ చేశారు. జిల్లాకు ఒకే పేపర్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీఈటీ పోస్టుల సంఖ్య పెంచాలన్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం నిరంతరం పోరాడుతుందన్నారు. నగర ప్రధానకార్యదర్శి లంకా గోవిందరాజులు, సహాయ కార్యదర్శి సింగంశెట్టి మోహన్‌కుమార్, శీరం రవికుమార్, గంట మమత, ఉపాళ్ల నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో దోచుకుంటున్న ప్రభుత్వాలు

- ఆమ్ ఆద్మీ జోనల్ కో-ఆర్డినేటర్ మహేశ్వర రెడ్డి

విజయవాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో రైతుల భూములను చౌకగా తీసుకుని తమ అనుచరులకు కట్టబెట్టే విధానం రాష్ట్రంలో నడుస్తుందని ఆమ్ ఆద్మీ పార్టీ జోనల్ కో-ఆర్డినేటర్ నేతి మహేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైజాగ్‌లో అభివృద్ధి పేరుతో సుమారు 60 ఎకరాలు ఓ కంపెనీకి కట్టబెడుతున్నారని, కంపెనీ వ్యక్తులు రూ.లక్ష పెట్టుబడితో రూ.1000 కోట్లు ప్రభుత్వం నుంచి లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. రామాయపట్నంలో రెండు పార్టీలు పెంచి పోషిస్తున్న ఓ కంపెనీకి రైతులకు మధ్య పోరాటంలో చేవూరు ప్రాంతానికి చెందిన ఒక యువరైతు ఈ సిండికేట్‌ను ఎదిరించలేక ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రెండు పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శించుకుంటున్నట్టు కనిపిస్తున్నా అనుచరులను కాపాడుకోవడంలో మాత్రం కలిసే పనిచేస్తున్నాయన్నారు. ఒక రైతుబిడ్డగా, ఆమ్ ఆద్మీ పార్టీ కందుకూరు అసెంబ్లీ అభ్యర్థిగా రైతుల పక్షాలన నిలబడతానన్నారు.

దుర్గమ్మ హుండీల ఆదాయం రూ.3.02 కోట్లు


కానుకలను లెక్కిస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, సేవా బృందం సభ్యులు

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. ఈవో కే రామచంద్ర మోహన్ పర్యవేక్షణలో జరిగిన కానుకల లెక్కింపులో ఏఈవోలు, ఉద్యోగులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, దేవదాయ శాఖ సిబ్బంది, వన్‌టౌన్ పోలీసులు, ఎస్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు. గతంలో కానుకల లెక్కింపు నుంచి ఇప్పటి వరకు 18 రోజుల వ్యవధికిగాను రూ.3,02,92,986 నగదు రూపంలో లభించింది. 440 గ్రాముల బంగారం, 5 కిలోల 225 గ్రాముల వెండి కూడా వచ్చాయి.

పథకాలకు విరాళాలు

దుర్గగుడిలో అన్నవితరణకు కృష్ణాజిల్లా కేసరపల్లికి చెందిన డీ నీలిమ సోమవారం ఆలయానికి విచ్చేసి రూ.1,04,293 విరాళం ఇచ్చారు. అలాగే విజయవాడ మాచవరానికి చెందిన అట్లూరి రామమోహనరావు, సువర్ణ దంపతులు అన్నవితరణకు రూ.లక్ష, గర్భాలయ శిఖర స్వర్ణతాపడానికి మరో రూ.లక్ష విరాళం అందించారు. దాతలకు అమ్మవారి దర్శనం కల్పించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అధికారులు, అర్చకులు వీరికి లడ్డూ ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

విరాళాలకు 80జీ వర్తింపు

దుర్గగుడిలో అమ్మవారి ఆలయశిఖరం స్వర్ణతాపడం దాతలకు 80జీ వర్తించేలా ఆదాయపు పన్ను శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. అధికారులు ఆలయ శిఖరానికి బంగారు తాపడం నిమిత్తం 3 నెలల క్రితం శ్రీకనకదుర్గా టెంపుల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. ఎక్కువ మంది దాతలు విరాళం ఇచ్చేందుకుగాను ఇటీవల అధికారులు, ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు 80జీ వర్తించేలా అనుమతివ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. ఇప్పటి వరకు కేవలం అన్నదాన పథకానికే 80జీ వర్తిస్తుంది. తాజాగా స్వర్ణ శిఖరానికి స్వర్ణ తాపడం నిమిత్తం విరాళాలిచ్చే దాతలకూ వెసులుబాటు కలిగింది. దీంతో ఎక్కువ మంది దాతలు విరాళాలిచ్చే అవకాశం ఉంది. ఇన్‌కమ్ ట్యాక్స్ యాక్ట్ ప్రకారం నిర్దేశించిన నిబంధనల మేరకు 80జీ వినియోగించుకోవచ్చు.

కార్పొరేటర్ల విజ్ఞానయాత్ర ప్రారంభం

కార్పొరేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల్లోని వివిధ నగరపాలకసంస్థల్లో అభివృద్ధిని అధ్యయనం చేయడానికి విజయవాడ నగర పాలకసంస్థ కార్పొరేటర్లు బయలుదేరారని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. ఈ మేరకు సోమవారం కార్పొరేటర్ల విజ్ఞానయాత్ర బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వీఎంసీ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ పర్యవేక్షణలో 24 మంది వైసీపీ, 17 మంది తెలుగుదేశం కూటమి సభ్యులు, ఇద్దరు కో-ఆప్టెడ్ మెంబర్లతో పాటుగా యాత్ర సమన్వయకర్తలు బీ కరుణాకర్ బాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రజియా షాబినా, పీఆర్‌వో, ముగ్గురు సహాయక సిబ్బంది బృందంలో ఉన్నారన్నారు. 22న బెంగుళూరు మున్సిపల్ కార్పొరేషన్, 23న మైసూర్ మున్సిపల్ కార్పొరేషన్, 26న మదురై మున్సిపల్ కార్పొరేషన్, 28న నాగర్‌కోయిల్ (కన్యాకుమారి) మున్సిపల్ కార్పొరేషన్, 29న త్రివేంద్రం మున్సిపల్ కార్పొరేషన్, మే 3న కొచ్చిన్ నగరపాలకసంస్థలో చేపట్టిన అభివృద్ధి, పలు ప్రాజెక్టుల పరిశీలన, ఆయా నగరాల్లో ప్రజలకు అందించే సంక్షేమ పథకాల అమలు విధానాలను అధ్యయనం చేస్తారని మేయర్ తెలిపారు.


జెండా ఊపి యాత్రను ప్రారంభిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మీ


ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

సమస్యలు పరిష్కరించాలి

- అంగన్‌వాడీల ధర్నాలో పలువురు వక్తలు

ధర్నాచౌక్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మారుస్తున్నామని ఐసీడీఎస్ మంత్రి ప్రకటించి ఇప్పటి వరకు జీవో ఇవ్వకపోవడం అన్యాయమని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, బాలసంజీవిని యాప్ మార్పులు, వర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్లకు మే నెలలో వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ వర్కర్ల సమస్యలపై అనేక సార్లు శాసనమండలిలో ప్రస్తావించానన్నారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో 42 రోజుల అంగన్వాడీల సమ్మె సందర్భంగా అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చినట్టు గుర్తు యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుబ్బరావమ్మ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లోని పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు మినీ వర్కర్లు ఆహారాన్ని వండి పెట్టడం, ఆరోగ్యం, ప్రీస్కూల్ విద్యను అందిస్తున్నారన్నారు. వీరికి తీవ్ర పనిభారం పెరిగిందన్నారు. వీరి కష్టాన్ని ప్రభుత్వం గుర్తించడం లేదని విమర్శించారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చామని అసెంబ్లీలో మంత్రి ప్రకటించినా జీవో ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. మినీ వర్కర్స్ రాజ్యలక్ష్మీ అధ్యక్షతన సీఐటీయూ రాష్ట్ర నేతలు నాగరాజు, ఎన్‌సీహెచ్.శ్రీనివాస్, వి.వెంకటేశ్వర్లు, ఎం.మనోహర్. అంగన్వాడీ రాష్ట్ర నాయకులు లక్ష్మీదేవీ, సుప్రజ, రమాదేవీ, నిర్మల, శకుంతల, విజయలక్ష్మీ, రాజేశ్వరీ, మహబాబున్నిసా, అధిక సంఖ్యలో మినీలు పాల్గొన్నారు.

భళా.. యువ కవి సమ్మేళనం

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మహాకవి శ్రీశ్రీ కవితా సంపుటి మహాప్రస్థానం జాతీయ కట్టడమని చారిత్రక వారసత్వ సంపద లాంటిదని ప్రముఖ కవి విమర్శకులు డాక్టర్ రావులపాటి సీతారాం అన్నారు. విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల స్వర్ణోత్సవ కార్యక్రమంగా ముమ్మానేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం సోమవారం ఉదయం సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించిన యువకవి సమ్మేళనానికి సీతారాం సంచాలకత్వం వహించారు. మహాప్రస్థానం ముద్రణ జరిగి ఏడున్నర దశాబ్దాలు కావస్తోందని, ఇప్పటికీ దాని ప్రభావంతోనే యువకవులు రాస్తున్నారని, అందుకు శ్రీశ్రీ దృక్పథ నిర్దేశం, కరవాలం లాంటి భావతీవ్రత ఒక కారణమని, జలపాతశైలి మరో కారణమన్నారు. సినీ రచయిత కట్టా సిద్ధార్థ, వర్ధమాన కవి తంగిరాల సోని, మాస్టర్‌మైండ్స్ ఇంటర్ విద్యార్థిని పీఎస్ఎస్‌జీ చిన్మయి, పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల డిగ్రీ విద్యార్థులు ఆర్.స్రవంతి, పి.ఎలిజబెత్ రాణి, వైద్య విద్యార్థిని నాగిశెట్టి రుషశ్రీ, పిన్నమనేని సిద్ధార్థ దంతవైద్య కళాశాల విద్యార్థి కునుకు మోనిష్, శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల డిగ్రీ విద్యార్థులు జి.ధరణి, పి.విజయకుమారి, కేబీఎన్ కళాశాల అధ్యాపకుడు పవన్‌కుమార్, విద్యార్థిని బి.భారతీబాయ్ కవితలు వినిపించారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి బీవీఎస్ ప్రకాష్, పీబీ సిద్ధార్థ ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కల్పన ప్రసిద్ధకవి సీతారాంతో పాటు యువకవులను సత్కరించారు. ఈ కవితాగోష్ఠిని తెలుగు శాఖాధిపతి డాక్టర్ ఎన్.శివకుమార్, సహాయక ఆచార్యులు డాక్టర్ సశ్రీ పర్యవేక్షించారు.



యువ కవి సమ్మేళనంలో పాల్గొన్న డాక్టర్ రావులపాటి సీతారాం, తంగిరాల సోనీ, తన్మయి

'ఆడుదాం.. కోట్లాట'పై విచారణ పూర్తి

నందిగామ, ఆంధ్రజ్యోతి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా నందిగామ కేంద్రంగా జరుగుతున్న 'ఆడుదాం.. కోట్లాట'పై విచారణ పూర్తయింది. తొలుత ఆస్తి తగాదా నమోదైన ఈ కేసు ఆంధ్రజ్యోతి కథనంతో ప్రాధాన్యత సంతరించుకుంది. శాప్‌లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఒక ఉద్యోగి, నందిగామకు చెందిన ఒక మహిళకు కోట్లాది రూపాయల సొమ్ము బదిలీ చేసినట్లు ఆంధ్రజ్యోతి కథనాల ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో సదరు మహిళ పేరుతో ఉన్న ఆస్తులను పోలీసులు పరిశీలించారు. చందర్లపాడు మండలం పోపూరు గ్రామంలో సదరు మహిళ పేరుతో ఉన్న ఏడున్నర ఎకరాల భూమితో పాటు నందిగామ పట్టణంలోని విలువైన స్థలాలు, నిర్మాణంలోని డూప్లెక్స్ ఇంటిని పరిశీలించి నివేదికను సిద్ధం చేశారు. దీన్ని మంగళవారం సీపీకి అందజేస్తామని సీఐ వైవీవీఎల్ నాయుడు తెలిపారు. మరోవైపు ఈ కేసును సీఎం కార్యాలయం ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఆడుదాం.. ఆంధ్రా స్కామ్‌పై సీరియస్‌గా ఉన్న కూటమి ప్రభుత్వం ఈ కేసుపై నిఘా పెట్టినట్లు తెలిసింది. గత ఫిబ్రవరి నుంచి ఆగస్టు వరకూ నగదు బదిలీతో పాటు క్రయ విక్రయాలు జరిగినట్లు తెలిసింది. నందిగామ స్టేషన్ నుంచి ఈ కేసు ఉన్నతాధికారులకు చేరుతుండడంతో పరిణామాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సి ఉంది.

శ్రీనివాస్, సౌందర్యపై చర్యలు తీసుకోవాలి

- జూనియర్ మహిళా న్యాయవాది మణిప్రియ డిమాండ్



గాంధీనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మహిళా న్యాయవాదినైన తనకే న్యాయం జరగడం లేదని తనపై దాడి చేసిన వారిపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని జూనియర్ న్యాయవాది మణిప్రియ ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడింది. తాను 2023 నుంచి బెజవాడ బార్ అసోసియేషన్‌లో సభ్యురాలిగా కొనసాగుతున్నట్టు పేర్కొన్నారు. కొన్నేళ్ల క్రితం నుంచి భర్తతో విభేదాల కారణంగా కేసు నిమిత్తం కోర్టుకు వస్తున్న క్రమంలో ఎల్ఎల్‌బీ చదివి జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నానని తెలిపింది. గతంలో పిట్టల శ్రీనివాస్ అనే న్యాయవాదితో కేసు విషయమై పరిచయం ఏర్పడి సలహాలు తీసుకున్నట్టు చెప్పారు. కొద్దిరోజుల నుంచి భర్తతో విడాకులు తీసుకుని తనను పెళ్లిచేసుకోవాలని శ్రీనివాస్ వేధించేవాడన్నారు. ఈ నెల 17న కోర్టు కారిడార్‌లో శ్రీనివాస్ అసభ్యంగా ప్రవర్తించినట్టు చెప్పింది. పోలీసులకు ఫిర్యాదు చేసి మాట్లాడేందుకు బార్ ప్రెసిడెంట్ చాంబర్‌కు వెళ్లిన తనపై సౌందర్య అనే మహిళా న్యాయవాదితో కలిసి శ్రీనివాస్ దాడి చేసి బట్టలు చింపేశారన్నారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్, మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, ఇప్పటి వరకు పోలీసులు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా కేసు వెనక్కు తీసుకోవాలని బెదిరిస్తున్నారని, అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా పిట్టల శ్రీనివాస్, సౌందర్యను సస్పెండ్ చేసి తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



అట్లాంటాలో ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు అమెరికాలోని అట్లాంటా స్టేట్‌లో ఎన్ఆర్ఐ టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించగా ఆ వేడుకల్లో గుడ్లవల్లేరు మాజీ సర్పంచ్ చాపరాల బాలాజీ, ఆయన కుమారుడు చాపరాల రాకేష్‌లు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. ఈ వేడకల్లో పాల్గొన్న బాలాజీకి ఎమ్మెల్యే కట్‌చేసి కేక్‌ని తినిపించారు. నియోజకవర్గంలోనే కాక అమెరికాలో కూడా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని బాలాజీని, వారి కుమారుడిని ఎమ్మెల్యే అభినందించారు.



బాలాజీకి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

డ్రెయినేజీలు అస్తవ్యస్తం

● పూడుకుపోయిన డ్రెయినేజీలు ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - తోట్లవల్లూరు) : స్వచ్ఛాంధ్రలో రోడ్లపై చెత్తను తొలగించటం, గృహాల నుంచి తడి, పొడి చెత్తను సేకరించటమే కాదు డ్రెనేజీలను శుభ్రంగా ఉంచటం అందులో భాగమే. డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉంటే మురుగు నిలిచిపోయి దోమలు ఉత్పన్నం కావటంతో పాటు దుర్గంధ సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో అనారోగ్యాల బారీన పడక తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు.

తోట్లవల్లూరులో మెయిన్ సెంటర్‌లో డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. మత్స్యకారుల బజారు నుంచి బస్‌షెల్టర్ వైపు డ్రెయినేజీలోకి మురుగు వచ్చేందుకు సీసీరోడ్డు కింద ఉన్న తూము పూర్తిగా మట్టితో పూడుకుపోయింది. దీంతో సీసీరోడ్డు ఆవలి నుంచి మురుగు ఇటువైపుకి వచ్చే మార్గం లేకుండా పోయింది. అలాగే బస్‌షెల్టర్ ముందు, వేణుగోపాలస్వామి దేవస్థానం ముందు ఉన్న కాంక్రీటు డ్రెయినేజీ మురుగు నడిచేందుకు వీల్లేకుండా పూడుకుపోయింది. కొంత భాగం చెత్తా,చెదారంతో నిండిపోగా ఆర్అండ్‌బీ రోడ్డు పక్క మలుపులో కొంత భాగం డ్రెయినేజీలో భారీగా మట్టి పేరుకుంది. ఇక్కడ కల్వర్టు కిందగా రిక్షాస్టాండ్ వైపు డ్రెయినేజీలోకి మురుగు ప్రవహించే వీల్లేకుండా పోయింది. రిక్షాస్టాండు నుంచి ఉన్న డ్రెయినేజీలో చెత్తా,చెదారం పేరుకుపోయింది. ఇక్కడ హోటల్, దుకాణాల వ్యర్థాలు డ్రెయినేజీలోనే ఉంటున్నాయనే విమర్శలు ఉన్నాయి. గ్రామ పంచాయతీ అధికారులు ఈ డ్రెయినేజీలో పూడికతీసి, దెబ్బతిన్న కాంక్రీటు గోడలను పునర్నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. లేకపోతే వచ్చే వర్షాకాలంలో మురుగు సమస్య వెంటాడుతూనే ఉంటుందని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



ఆర్టీసీ బస్‌షెల్టర్ వద్ద చెత్తాచెదారంతో నిండిన డ్రెయినేజీ



రిక్షాస్టాండు వద్ద డ్రెయినేజీలో పేరుకున్న వ్యర్థాలు

30లోపు ఈకేవైసీ చేయించుకోవాలి

తోట్లవల్లూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుద్వారా లబ్ధిపొందుతున్న ప్రతి ఒక్కరూ ఈ నెల 30లోపు ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ ఎం. కుసుమకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల కంటే తక్కువ వయస్సు గలవారు, 80 ఏళ్ల పైబడినవారు మినహాయించి అందరు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. ఎండీయూ ఆపరేటర్లు, రేషన్‌షాపు డీలర్లు, వీఆర్వో, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ వద్ద ఈకేవైసీ చేయించుకునే సౌలభ్యం ఉందన్నారు. ఈ నెల 30లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని తహసీల్దార్ కుసమకుమారి కోరారు. మండలంలో 1090 కార్డులను ఈకేవైసీ చేయించాల్సి ఉందన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఏఎన్ఆర్ విద్యార్థులు

గుడివాడ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 19,20 తేదీల్లో విజయవాడ శ్రీకృష్ణవేణి డిగ్రీ కళాశాలలో జరిగిన కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాల సాఫ్ట్‌బాల్ పోటీల్లో గుడివాడ ఏఎన్ఆర్ కళాశాల జట్టు ద్వితీయ స్థానం సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక కళాశాలలో ప్రతిభ చూపి ఆల్ ఇండియా పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల జట్టులోని జి.భార్గవ్, టి.ప్రభుకుమార్‌రాజు, జి.కోటేశ్వరరావు, డి.శివశంకర్‌లు ఆల్ ఇండియా పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ఆర్‌కె ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, ఫిజికల్ డైరెక్టర్ వీర్ల గోపి, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల పాలకవర్గ సభ్యులు



రామానుజమ్మను సత్కరిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు

రామానుజమ్మ సేవలు అభినందనీయం

పామర్రు : విధుల పట్ల అంకితభావంతో విద్యార్థులకు, పాఠశాలకు, ఉపాధ్యాయ సిబ్బందికి సబార్డినేట్‌గా రామానుజమ్మ అందించిన సేవలు మరువలేనివని పామర్రు ఎంఈవో-2 శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కంచర్ల రామారావు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సబార్డినేట్‌గా పనిచేస్తూ పదవీవిరమణ చేస్తున్న రావులపాటి రామానుజమ్మకు సోమవారం పాఠశాలలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఈవో రామానుజమ్మ అందించిన సేవలను కొనియాడారు.అనంతరం ఆమెను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం కె.కోటేశ్వరరావు, ఆకుల బ్రహ్మం, ఎపీజీఈఏ సంఘ అధ్యక్షులు ఏసుబాబు, విజయకుమార్, శివనాగమణి, పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నియంత్రణే లక్ష్యం

గుడివాడ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అగ్ని ప్రమాద పరికరాల ఎగ్జిబిషన్‌ను గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ సోమవారం పరిశీలించారు. ప్రస్తుత వేసవి కాలంలో అగ్నిప్రమాదాల నియంత్రణపై ప్రజలు అవగాహన ఉండాలన్నారు. ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. అగ్నిప్రమాద నివారణ పరికరాల, యంత్రాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.



పరికరాల పనితీరును పరిశీలిస్తున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

మంచినీటి చెరువులకు తాగునీరు అందించాలి

● ఇరిగేషన్ ఏఈ పవన్

నందివాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): దోసపాడు ఛానల్ ద్వారా శివారు గ్రామాలకు సైతం తాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ ఏఈ పవన్ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రజాపరిషత్ అధికారి మల్లేశ్వరి, తహసీల్దార్ గురుమూర్తి ఆధ్వర్యంలో మండల ప్రభుత్వ అధికారులచే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల వారీగా ప్రభుత్వ అధికారులచే ఒక ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. వేసవి శివారు గ్రామాలకు సైతం మంచినీటి చెరువులు నింపే విధంగా చర్యలు చేపట్టాలని మండల స్థాయి అధికారులకు సూచించారు. సోమవారం దోసపాడు ఛానల్‌కు 200 క్యూసెక్కుల నీరు వదిలామన్నారు. దోసపాడు కాలువ ద్వారా వచ్చే నీళ్లకు రాత్రి కూడా అధికారులు కాపలా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు బి.ఏసుబాబు, రవి, ఈవోపీఆర్డీ అమీర్ మీర్జా బాష, ఫిషరీష్ అధికారులు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇరిగేషన్ ఏఈ పవన్

ఎన్నికల హామీ నెరవేర్చాలని ధర్నా

గుడివాడ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : గత ఎన్నికల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఇచ్చిన టిడ్కో రుణమాఫీ హామీని నిలబెట్టుకోవాలని, వెంటనే కాలనీలో మౌళిక వసతులను కల్పించాలని టిడ్కోకాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ అరుణ డిమాండ్ చేశారు. టిడ్కో రుణమాఫీ హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ గుడివాడలోని మల్లాయిపాలెం శివారు టిడ్కోకాలనీ, వాటర్ ట్యాంకు వద్ద సోమవారం ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే పలుపర్యాయాలు అధికారులు,ప్రజాప్రతినిధులకు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలను అందజేసిన ఫలితం శూన్యమన్నారు. బ్యాంకర్లు రుణాలను చెల్లించాలని దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రుణమాఫీ చేసేవరకు పోరాడతామన్నారు. కాలనీలో సచివాలయం, పాఠశాల, ఆసుపత్రులను వెంటనే నిర్మించాలని కోరారు. 10రోజుల్లో సమస్యలను పరిష్కరించకుంటే తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలో సంఘ సహాయకార్యదర్శులు నాగవాణి, సంబంగి రంగమ్మ, కమిటీ సభ్యులు హైమావతి, ప్యారీ, శ్రీను, లక్ష్మీ, లక్ష్మీ, ఉమ పాల్గొన్నారు.



నిరాహార దీక్షలో పాల్గొన్న టిడ్కోకాలనీవాసులు

ముగిసిన రాష్ట్రస్థాయి కళాపరిషత్ నాటిక పోటీలు

గుడివాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎస్‌పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మూడ్రోజులుగా కృష్ణా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కళాపరిషత్ నాటిక పోటీలు సోమవారంతో ముగిశాయి. ఉత్తమ ప్రథమ ప్రదర్శనగా "జనరల్ భోగీలు 2, రెండవ ఉత్తమ ప్రదర్శనగా "ఇది అతని సంతకం", మూడో ఉత్తమ ప్రదర్శనగా "నాన్నా నేనొచ్చేస్తా" నాటికలు నిలిచాయి. ప్రత్యేక జ్యూరీ ప్రదర్శనగా "చిగురు మేఘం", ఉత్తమ దర్శకుడిగా, ఉత్తమ నటుడిగా ఎన్.రవీంద్రారెడ్డి ఎంపికయ్యారు. ఉత్తమ రచనగా పి.టి మాధవ్ ఎంపికయ్యారు. ఉత్తమ నటిగా సురభి ప్రభావతి ఎంపికయింది. ఉత్తమ ప్రతినాయకునిగా గోపరాజు విజయ్ ఎంపికయ్యాడు. ఉత్తమ హాస్యనటుడుగా టి.వెంకటేశ్వరరావు ఎంపికయ్యాడు. ఉత్తమ సహాయనటుడుగా పవన్ , ఉత్తమ సహాయనటిగా కె.సరిత ఎంపికయ్యారు. ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కావూరి సత్యనారాయణ, ఉత్తమ క్యారెక్టర్ నటిగా అమృతవర్షిణిలు ఎంపికయ్యారు. ఉత్తమ సంగీత దర్శకునిగా పి.లీలామోహన్, ఉత్తమ ఆహార్యం పురస్కారానికి దీ లీప్‌కుమార్‌లు ఎంపికయ్యారు. ఉత్తమ రంగాలంకారణ పురస్కారానికి వై.ప్రసాద్, గిరిలు ఎంపికయ్యారు. న్యాయనిర్ణేతలుగా గుడివాడకు చెందిన సుఖమంచి మల్లిక్, తిరుపతికి చెందిన వి.వేణుగాపాల్‌లు వ్యవహరించారు. విజేతలకు మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు బహుమతులను అందజేశారు.



బహుమతులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి

విద్యార్థుల రోల్ ఆధారంగా పాఠశాలల విభజన

గుడివాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యాసంవత్సం నుంచి ప్రస్తుతం ఉన్న పాఠశాలలోని విద్యార్థుల రోల్‌ను బట్టి ఫౌండేషన్, బేసిక్ ప్రాథమిక, మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మార్పు చెందుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె రామారావు అన్నారు. సోమవారం స్థానిక మాంటిస్సోరి ఉన్నత పాఠశాలలో గుడివాడ డివిజన్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఈవో రామారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రస్తుతం చదువుతున్న తరగతి నుంచి ఉన్నత తరగతికి అప్‌గ్రేడ్ ప్రక్రియను ఈ నెల 23వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు తమ తమ పాఠశాలల పరిధిలో ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు చేరేలా చూడాలని ఆదేశించారు. పాఠశాలల విద్యా ప్రమాణాలు, అకాడమిక్ విషయాలపై క్లస్టర్ ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. క్లస్టర్ పరిధిలోని ప్రతి ప్రైవేటు పాఠశాల 12 ఐ.సీ రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా మానిటరింగ్ చేయాలన్నారు. విద్యార్థి మిత్ర కిట్లు, పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ డీవైఈవో కె.రవికుమార్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

అప్‌గ్రేడేషన్‌ను పూర్తిచేయాలి

గుడివాడ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం చదువుతున్న తరగతి నుంచి ఉన్నత తరగతికి అప్‌గ్రేడేషన్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని మండల విద్యాశాఖ అధికారి బాలాజీ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ ప్రాథమిక పాఠశాల(పార్కు స్కూల్)ను ఆయన సందర్శించారు. పదోన్నతిపై వెళుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.పవన్‌కుమార్, ఉపాధ్యాయులు యు.శ్రీనివాస్, వి.భార్గవిలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేష్మాబేగం, సౌమ్య, తేజేశ్వరీ, బి.రచన, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

గుడివాడ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రతి పొలంలో భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బోలెం అనంతలక్ష్మీ అన్నారు. సోమవారం దొడంపాడులోని పొలాలకు వెళ్లి రైతులను పిలిపించి ఆమె జియో ట్యాగింగ్ చేయించారు. వ్యవసాయశాఖ సిబ్బంది రైతుల సమక్షంలో మట్టిని తీసి మెత్తగా చేసి మట్టి పరీక్షించటానికి ఒక పాలిథిన్ కవర్‌లో తీసుకున్నారు. ఈ మట్టిలో రైతు పేరు, పొలం విస్తీర్ణం తదితర వివరాలు రాసి గుడివాడ మార్కెట్ యార్డులోని భూ పరీక్షా కేంద్రానికి తరలిస్తున్నట్టు తెలిపారు. ప్రతి రైతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ భవాని, దొండపాడు రైతులు పాల్గొన్నారు.

కౌలుదారులను ఆదుకోవాలి

కూచిపూడి: కౌలుదారులకు చట్టం రూపొందించి వారికి గుర్తింపు కార్డులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా పథకం కల్పించి వారిని ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చినముత్తేవిలో జరిగిన కౌలు రైతు సంఘం, వ్యవసాయ రైతు సంఘ సమావేశంలో ఆయన ముఖ్యాతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావొస్తున్నా ఇంత వరకు ఈ ప్రభుత్వం కౌలు రైతు చట్టాన్ని రూపొందించలేకపోయిందని విమర్శించారు. రైతులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జూన్ నెలలో పెద్ద ఎత్తున కౌలు దారులను రాష్ట్రం మొత్తం సమీకరించి విజయవాడలో పెద్ద ఎత్తున నిరసన చేపట్టనున్నట్టు హెచ్చరించారు. సంఘ నేతలు సుబ్రహ్మణ్యం, రంగారావు, శీలం నారాయణరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పొలిమేర డొంక తవ్వకాలపై ఫిర్యాదు

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మామిడికోళ్ల నుంచి గుడ్లవల్లేరు పొలిమేర డొంకను అర్ధరాత్రిళ్లు తవ్వి అమ్ముకొంటున్న ఓ రైతుపై ఆ డొంకకు ఇరువైపులా ఉన్న రైతులు సోమవారం గుడ్లవల్లేరు తహసీల్దారు లోకరాజుకు ఫిర్యాదు చేశారు. ఈనెల 19వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకు గుడ్లవల్లేరుకు చెందిన కాగిత హరి అనే రైతు మామిడికోళ్ల నుంచి గుడ్లవల్లేరు గ్రామానికి పొలిమేర డొంక దిబ్బను అక్రమంగా తవ్వి ఆమట్టిని అమ్ముకున్నాడని రైతులు బొర్రా నాగేశ్వరరావు, నిడుమోలు పెద్దిరాజులు, కుసం కోటేశ్వరరావులు ఫిర్యాదు చేశారు. రేపటి రోజున చేలలో నీరు పెట్టుకొంటే చుక్క నిలవదనీ ఆ కాలవలా తవ్విన గుంతలోకి దిగిపోతాయని వారు తమ గోడును తహసీల్దారుకు వెలిబుచ్చారు. తవ్విన ప్రాంతాన్ని పరిశీలించి రైతులకు తగున్యాయం చేయాలని వారు కోరారు. కాగా జరిగిన ఉదంతంపై విచారణ నిర్వహిస్తానని తగు చర్యలు చేపడతామని తహసీల్దారు లోకరాజు రైతులకు హామీ ఇచ్చారు.గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణకు సైతం రైతులు ఫిర్యాదు చేశారు.



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

రక్తదానం

గుడివాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బేతవోలుకు చెందిన ఆత్మకూరు కృష్ణకుమారి రక్తహీనతకు గురై చికిత్స నిమిత్తం స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాస్పత్రిలో చేరింది. వైద్యులు ఆమెను పరీక్షించి రక్తం అవసరమని కుటుంబసభ్యులకు తెలిపారు. సోమవారం కొనకళ్ల సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గోపయ్య రక్తదానం చేశారు. రక్త దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

పెదపారుపూడి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం పెదపారుపూడి మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెంట్రప్రగడ గ్రామానికి చెందిన సోలం దుర్గమ్మ (సబ్ డివిజన్) సర్వేకోసం అర్జీ రూపంలో తహసీల్దార్ వై.రంగారావుకి అందజేశారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



సదస్సులో మాట్లాడుతున్న సీడీపీవో విజయఫ్లారెన్స్

గుడివాడ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : పోషకాహారంతోపాటుగా శరీరానికి తగిన వ్యాయామం చేయ డం వల్లే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ గుడివాడ అధికారిణి ఎ.విజయ ఫ్లారెన్స్ అన్నారు. సోమవారం స్థానిక 13వ వార్డులోని అంగన్వాడీ కేంద్రాలు - 1,2,3లలో పోషకాహార పక్షోత్సవం సందర్భంగా బాలికల కోసం ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే విధంగా పోస్టర్‌లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ నాగజ్యోతి, టీడీపీ నేత అజయ్ పాల్గొన్నారు.

కూచిపూడి: పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఆవిరిపూడిలో పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులు, చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్వాడీలో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సూపర్‌వైజర్ పుణ్యవతి, కార్యకర్త నాగ పుణ్యవతి, భాగ్యలక్ష్మీ, మోహిని పాల్గొన్నారు.

పెదపారుపూడి : మండలంలోని వెంట్రప్రగడ -5 అంగన్వాడీ కేంద్రం పోషకాహార పక్షోత్సవాల కార్యక్రమం సూపర్‌వైజర్ ఎం.శివనాగమణి అధ్యక్షతన నిర్వహించారు. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డ పుట్టిన రెండేళ్ల వరకు తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి ఆమె వివరించారు. అంతేకాక పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు తీసుకొచ్చి ప్రతీ నెలా ఎత్తు, బరువు తీయించి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కూచిపూడిలో..



పెదపారుపూడిలో ..

పామర్రు : గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని తీసుకుని ఆరోగ్యవంతమైన బిడ్డను సమాజానికి అందించాలని పామర్రు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నూతక్కి సత్యశ్రీ అన్నారు. పట్టణంలోని బాపూజీపేట అంగన్వాడి కేంద్రంలో పోషణ్ పక్షోత్సవాలను పురస్కరించుకుని సోమవారం పోషకాహారం ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు ఆమె వివరించారు. చిన్నారుల సంరక్షణ, రక్తహీనత, పరిసరాల పరిశుభ్రత, అనుబంధ ఆహార పద్ధతులు, పిల్లల ఎదుగుదల, గర్భిణుల సంరక్షణ, పౌష్టిహారంపై సత్యశ్రీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళ సంరక్షణ కార్యదర్శి ఎం.స్వాతి, అంగన్వాడీ టీచర్లు శ్రీదేవి, పి.శ్రీలక్ష్మి, ఏఎన్ఎం విజయలక్ష్మి ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	124, 133, 144
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

29, 30 తేదీల్లో వజ్రోత్సవ వేడుకలు

ఘంటసాల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం లాం గుంటూరు నందు విశ్వవిద్యాలయం వజ్రోత్సవ వేడుకలు ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్నారని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డి.సుధారాణి తెలిపారు. ఈ వేడుకల్లో రైతులకు వ్యవసాయపరమైన నూతన సాంకేతికతను ప్రదర్శించనున్నారని తెలిపారు. అధునాతన సాంకేతికతపై విస్తృత చర్చా గోష్ఠి, వివిధ నూతన వంగడాలు, యాంత్రీకరణకు సంబంధించిన పరికరాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. రైతులు వజ్రోత్సవ వేడుకలకు విచ్చేసి సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

విద్యార్థులు సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలి



పెదతుమ్మిడి హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

బంటుమిల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సూచించారు. సోమవారం మండలంలోని పలు పాఠశాలలకు అవసరమైన ఫర్నిచర్‌ను డక్కన్‌ఫైన్ కెమికల్స్ సహకారంతో ఆయన అందజేశారు. మలపరాజుగూడెం హైస్కూల్‌కు రూ.1,31,200, పెదతుమ్మిడి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు రూ.2,01,700, ముంజులూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు రూ.4,27,750 విలువైన ఫర్నిచర్‌ను అందజేశారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

పెడన రూరల్: నడుపూరులో టీడీపీ సీనియర్ నాయకుడు కన్నెపోటు సాయికిరణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో చికిత్స అనంతరం ఆయన ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పరామర్శించారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్ ఆయన వెంట ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

ఘంటసాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఘంటసాలలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం పరిశీలించారు. స్థానిక సంత మార్కెట్ ఎదురుగా ప్రధాన రహదారి పక్కనే ఉన్న బోదెలో పూడికతీత పనులను పరిశీలించిన ఆయన ఉపాధి పథకం కూలీలతో మాట్లాడారు. పని కల్పిస్తున్నారా..మజ్జిగ అందిస్తున్నారా అని కూలీలను అడిగారు. టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, పూషడం సర్పంచ్ అంకం మారుతీరావు ఆయన వెంట ఉన్నారు.

మినీ గోకులం ప్రారంభం

కోడూరు: రామకృష్ణాపురం శివారు ఊటగుండంలో పల్లె పండుగ 2025-26 కార్యక్రమం ద్వారా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.38,551తో నూతనంగా నిర్మించిన పశువుల నీటి తొట్టెను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. రామకృష్ణాపురంలో ఉపాధి నిధులు రూ.2,30,000తో గొరిపర్తి శ్రీనివాసరావు నిర్మించుకున్న మినీ గోకులంను ఆయన ప్రారంభించారు. ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఎంపీడీవో జి.సుధాప్రవీణ్, పంచాయతీ ఈవో కొక్కిలిగడ్డ ఏడుకొండలు, ఏపీవో రవికుమార్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శాంతిభద్రతలను పరిరక్షించేందుకు కొంత కాలం రాష్ట్రపతి పాలన విధించాలని నాయకులు డిమాండ్ చేశారు. సూరిశెట్టి హరికృష్ణ, వర్రె రాజశేఖర్, పులవర్తి శ్రీనివాస్, కోట శ్రీకాంత్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

పెడన, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఉప్పకలవగుంట గ్రామానికి చెందిన చిట్టూరి రామకృష్ణ(60) అనుమానాస్పద స్థితిలో నందిగామ సమీపంలోని బొడ్డువానిపాలెం పొలాల్లో మృతి చెంది ఉన్నట్టు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. రామకృష్ణ భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జి.సత్యనారాయణ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రామకృష్ణకు మతి స్థిమితం లేదు. అతని భార్య లక్ష్మి పదేళ్ల క్రితం కంకిపాడు సమీపంలోని నెప్పల్లిలోని పుట్టింటికి వెళ్లిపోయింది. ఆడపిల్లలిద్దరూ పెళ్లి చేసుకుని అత్తారింటికి వెళ్లిపోయారు. ఒంటరిగా ఉన్న రామకృష్ణకు తిండి పెట్టేవారు లేక ఎక్కడ భోజనాలు ఉంటే అక్కడ కడుపు నింపుకొనేవాడు. రామకృష్ణ ఈనెల 18 నుంచి గ్రామంలో కనిపించడం లేదు. సోమవారం తెల్లవారుజామున బొడ్డువానిపాలెంలోని పొలాల్లో శవమై కనిపించాడు.

మచిలీపట్నం అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని నగర పాలక సంస్థ కమిషనరు బాపిరాజు పేర్కొన్నారు. సోమవారం 45 వడివిజన్‌లోని ఇండోర్ స్టేడియం మెరక పనులను ఆయన పరిశీలించారు. అనంతరం రాయపాటి శ్రీరాములు మెమోరియల్ పార్కును సందర్శించారు. పార్కును అభివృద్ధి చేస్తామన్నారు. వర్షం వస్తే సమస్యగా ఉన్న రెవెన్యూ కల్యాణమంటపం ఎదుటి రోడ్డు, నారాయణస్కూలు ఎదుటి రోడ్లకు అప్రోచ్ నిర్మిస్తామన్నారు. డ్రెయిన్ల పూడికతీతను ఆయన పరిశీలించారు.

ఆర్యవైశ్య వధూవరుల పరిచయవేదికకు అనూహ్య స్పందన

పెడన, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో వాసవీ కల్యాణ మండపంలో ఎంట్రీ ఫీజు లేకుండా నిర్వహించిన ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదికకు అనూహ్య స్పందన లభించింది. 300 మంది యువతీ యువకుల బయోడేటాలను వేదికపై చదివి వినిపించారు. అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు, పెడన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ సేవా కార్యక్రమాల కమిటీ ఛైర్మన్ మామిడి ప్రసాద్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు సన్నిధి నాగసాయి పాల్గొన్నారు.

పెంచిన పన్నులు తగ్గించాలి: సీపీఎం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టణ ప్రాంతాల్లో పెంచిన పన్నుల భారాన్ని తగ్గించాలని సీపీఎం నగర కమిటీ అధ్యక్షుడు బి.సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రూ అప్ చార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపారని, గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిరు వ్యాపారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. నగర ప్రజలకు రోజూ తాగునీరు అందించాలని సీపీఎం సీనియర్ నాయకుడు కొడాలి శర్మ కోరారు. నాయకులు సీహెచ్ జయరావు, టి.చంద్రపాల్, ఎండీ యూనస్ పాల్గొన్నారు.

తుప్పుపట్టిపోతున్నాయ్!

(ఆంధ్రజ్యోతి-నాగాయలంక): తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో అధికారులు వినియోగించిన జీపు తుప్పు పట్టి పూర్తిగా ధ్వంసమైపోయింది. మండలం ఏర్పాటు చేసిన తర్వాత అప్పటి ప్రభుత్వ అధికారులు పర్యటనకు వెళ్లేందుకు ప్రతి మండలానికి ప్రభుత్వం ఒక జీపును కేటాయించింది. కొంతకాలంపాటు ఆ జీపును అధికారులు వినియోగించుకున్నారు. కాలక్రమేణా ఆ వాహనానికి మరమ్మతులు అవసరమవడంతో అధికారులు దానిని మూలన పడేశారు. ఇప్పుడు పూర్తిగా ధ్వంసమైనది. తీర ప్రాంత మండలమైన నాగాయలంకకు ప్రభుత్వం ఒక ఫైబర్ పడవను ఇచ్చింది. దానిని తహసీల్దార్ కార్యాలయంలో ఉంచటంతో అందులోని ఇంజన్‌తో పాటు పడవ తుప్పుపడుతోంది. విలువైన ప్రభుత్వ వస్తువులను కాపాడాలని పలువురు కోరుతున్నారు.



తుప్పుపట్టిన పడవ



తహసీల్దార్ కార్యాలయంలో తుప్పుపట్టిన జీపు

రోడ్డు ఆక్రమించి భవన నిర్మాణం

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం టౌన్): చేపల మార్కెట్‌ను పోర్టురోడ్డును కలిపే రోడ్డుకు ఎదురు రోడ్డు ఆరడుగులు ఉంటుంది. ఇరుకుగా ఉండే ఆ రోడ్డుపై పిల్లర్లు వేసి కొందరు వ్యాపారులు నూతన భవనాల నిర్మాణాలు చేపడుతున్నారు. అయినా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినవడుతున్నాయి. కొందరు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నట్టు తెలుస్తోంది. టౌన్‌ప్లానిగ్ అధికారులను వివరణ కోరగా, ఈ వ్యవహారం ఇప్పుడే తమ దృష్టికి వచ్చిందని చర్యలు తీసుకుంటామని తెలిపారు.



చేపలమార్కెట్‌కు ఎదురు రోడ్డుపై భవన నిర్మాణం కోసం వ్యాపారులు వేసిన పిల్లర్లు



డీఎం పెద్దిరాజుకు నూతన కమిటీ జాబితాను అందిస్తున్న నాయకులు

ఏపీపీటీడీ కార్మిక పరిషత్ అధ్యక్షుడిగా ఈఎస్ శంకర్

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం ఆర్టీసీ డిపోలో నూతనంగా ప్రారంభించిన ది ఏపీపీటీడీ కార్మిక పరిషత్ అధ్యక్షుడిగా ఈఎస్ శంకర్ ఎన్నికయ్యారు. సోమవారం డిపోలో నిర్వహించిన ఎన్నికల్లో ఛైర్మన్‌గా ఎస్.ఎస్.రాజు, చీఫ్ అడ్వయిజర్‌గా పి.ఎస్.రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.నాగరాజు, వైస్‌ప్రెసిడెంట్‌గా ఎం.వి.ఆంజనేయులు, కార్యదర్శిగా వై.శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రటరీగా ఎల్.కె.వి.ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా ఎం.కె.వి.బాబు, కోశాధికారిగా వి.సుబ్బారావు, పబ్లిసిటీ కార్యదర్శిగా ఎస్.శంకరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.కృష్ణ ఎన్నికయ్యారు. డిపో మేనేజర్ పెద్దిరాజును కలిసి వారు కార్మికుల సమస్యలపై చర్చించారు. నూతన కమిటీలో ఎన్నికయిన ప్రతినిధుల జాబితాను అందించారు.

దేశభక్తికి ప్రతీక ఎన్‌సీసీ



మునిసిపల్ హైస్కూలులో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు, దేశభక్తికి ఎన్‌సీసీ ప్రతీక అని ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. చిలకలపూడి మునిసిపల్ హైస్కూలులో సోమవారం ఎన్‌సీసీ విద్యార్థులకు క్యాంపు కిట్లను ఎస్పీ అందజేశారు. ఎన్‌సీసీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉంటాయన్నారు. తాను 9వ తరగతి చదువుకునే రోజుల్లో ఎన్‌సీసీ శిక్షణ సమయంలో తుపాకీ పట్టుకోవడం నేర్చుకున్నానన్నారు. ఆ తరువాత ఎస్పీ అయిన తరువాత ఫైరింగ్‌లో మొదటి స్థానంలో నిలిచానన్నారు. ప్రతి వ్యక్తికి విద్యార్థి దశ ఎంతో కీలకమని, ఎన్‌సీసీ ద్వారా చక్కని శారీరక దారుఢ్యంతో పాటు ఆత్మస్థైర్యం, సమయస్ఫూర్తి అలవడతాయని డీఈవో పీవీజే రామారావు అన్నారు. ప్రధానోపాధ్యాయుడు యూవీ కృష్ణమూర్తి, ఎన్‌సీసీ అధికారి అప్పినేడి వెంకట రామాంజనేయులు, ఆంధ్రప్రభుత్వ మాజీ సలహాదారుడు దిట్టకవి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఒకేషనల్ కోర్సులో శిక్షణ పొందిన విద్యార్థులకు ఎస్పీ, డీఈవో ప్రశంసాపత్రాలను అందజేశారు.

మల్లాం ఘటనకు కారకులపై చర్యలు తీసుకోవాలి

అవనిగడ్డ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గం మల్లాం గ్రామంలో దళితవాడ సాంఘిక బహిష్కరణకు ఆదేశించిన వారిపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ డిమాండ్ చేశారు. ఈ ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించాలన్నారు. సిట్టింగ్ జడ్జితో సామాజిక న్యాయ సమీక్ష నిర్వహించాలని ఆయన కోరారు.

24న విద్యుత్ అదాలత్

చల్లపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరం(సీజీఆర్ఎఫ్) విజయవాడ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన చల్లపల్లిలో విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణానాయక్ తెలిపారు. పెదకళ్లేపల్లి రోడ్డులోని చల్లపల్లి వర్తకసంఘం ఫంక్షన్ హాలులో ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ జస్టిస్ ఎన్.విక్టర్ ఇమ్మానియేల్, ఫోరం సభ్యులు, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు పాల్గొంటారని, చల్లపల్లి డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా సర్వీసు నెంబరు, పూర్తి అడ్రస్, సెల్‌నెంబరుతో అర్జీ ఇచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, మీటరు సమస్యలు, బిల్లుల సమస్యలు విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఇతర సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బోలెం రామారావుకు సన్మానం

చల్లపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జీసీఎస్ వల్లూరు ఫౌండేషన్ నుంచి బంగారు నంది అవార్డు పొందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు బోలెం రామారావును స్థానిక విజయనగర్ కాలనీలోని ఆయన స్వగృహంలో పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు సన్మానించారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ మచిలీపట్నం అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP 18/2010 in LA OP 16/1995 (SCJ AVG)
Between:
శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానం, నాగాయలంక Rep.By its F.F.M. సి.విశాలక్ష్మి ... D.Hr
మరియు
The R.D.O Cum LAO, Bandaru ...J.Dr
ఈ దిగువ షెడ్యూలు దాఖలా చరాస్తినిపై కోర్టు వారి యెదుట ది.02-05-2025న ఉదయం గం. 10.30 ని.ల నుండి వేలం వేయబడును. కావున పాడుకొనవదలచిన వారు పాటలో పాల్గొనవచ్చును. షెడ్యూలు: కృష్ణాజిల్లా, మచిలీపట్నం సబ్ రిజిష్ట్రారు వారి యిలాకా, మచిలీపట్నం మున్సిపల్ ఏరియాలో మచిలీపట్నం, చిలకలపూడి కలెక్టరు గారి ఆఫీసు కాంపౌండులో వున్న J.Dr కు సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములలో యున్నటువంటిన్నీ, యీ నెంబరు డిక్రీ బాకీ క్రింద జప్తు కాబడినటువంటిన్నీ వేలం కావలసిన చరాస్తి వివరం.

వ.నెం.	వివరము	సంఖ్య	కిమ్మత్తు
1.	కంప్యూటర్స్ H.P. కంపెనీ	5	30,000/-
2.	ప్రింటర్స్	3	3,000/-
3.	అయిరన్ బీరువాలు	6	6,000/-
4.	సీలింగు ఫ్యానులు	6	3,000/-
5.	టేబుల్స్	10	5,000/-
6.	కుర్చీలు	15	1,500/-
7.	చెక్క బీరువా	1	500/-
8.	రివాల్వింగు కుర్చీలు	2	1,000/-
9.	జనరేటర్	1	10,000/-
10.	వాటర్ కూలర్	1	500/-
		వెరశి రూ.	60,500/-

D.Hr కిమ్మత్తు: రూ.60,500/- అమీనా కిమ్మత్తు: రూ.60,500/-
మచిలీపట్నం ది.21-04-25
O.S.A.శివకుమార్ D.Hr తరుపున అడ్వకేట్

కొల్లూరి వెంకటేశ్వరరావుకు సత్కారం



కొల్లూరిని సత్కరిస్తున్న బండే శ్రీనివాసరావు తదితరులు

అవనిగడ్డ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన కొల్లూరి వెంకటేశ్వరరావును టీడీపీ కోడూరు మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు నేతృత్వంలో నాయకులు సత్కరించారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మండవ బాలవర్ధిరావు, నేతలు బండే రాఘవ, అప్పికట్ల రవీంద్రబాబు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, కూరపాటి శ్రీనివాసరావు, తోట సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టు ఎక్స్‌పోను పరిశీలిస్తున్న కేయూ వీసీ రాంజీ

పరిశోధనా దృష్టి పెంపొందించుకోండి

● ఇంజనీరింగ్ విద్యార్థులతో కేయూ వీసీ రాంజీ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు పరిశోధనా దృష్టిని పెంపొందించుకోవాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కె.రాంజీ అన్నారు. యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల 4వ ఏడాది విద్యార్థులు నిర్వహించిన ప్రాజెక్టు ఎక్స్‌పోను ఆయన సందర్శించారు. రెక్టార్ ఎం.వి.బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఎన్.ఉష, డీన్ సుందరకృష్ణ, ప్రిన్సిపాల్ విజయకుమారి పాల్గొన్నారు.

గర్భవతులు పోషకాహారం తీసుకోవాలి

బంటుమిల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గర్భవతులు పోషకాహారం తీసుకుంటే పుట్టే పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని వక్తలు వివరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పోషణ పక్షోత్సవాల కార్యక్రమంలో ఎంపీపీ వెలివెల చినబాబు, ఎంపీడీవో శైలజ, సీడీపీవో సముద్రవేణి పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం-4లో..

గూడూరు: అంగన్వాడీ కేంద్రం-4 వద్ద సీడీపీవో కె.గ్లోరీ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, సర్పంచ్ లింగం సులోచనారాణి విజయకుమార్ పాల్గొన్నారు.

రేపు హుండీల లెక్కింపు

మోపిదేవి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామికి భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను బుధవారం లెక్కిస్తామని ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే లెక్కింపులో పాల్గొనదలచిన భక్తులు డ్రెస్ కోడ్ నిబంధనలు పాటించాలని తెలిపారు.

కోసూరువారిపాలెం పంచాయతీ కార్యదర్శికి సత్కారం

మోపిదేవి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కోసూరువారిపాలెం పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావును ఆదర్శంగా తీసుకుని విధులు నిర్వర్తించాలని ఉద్యోగులకు మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకుడు పాండు రంగారావు విజ్ఞప్తి చేశారు. పంచాయతీలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్నులు రూ.6,04,582 నూరుశాతం వసూళ్లు చేసి స్వర్ణ పంచాయతీ యాప్‌లో ఆన్‌లైన్ చేశారన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర తడి, పొడి చెత్త కార్యక్రమాలు చురుగ్గా నిర్వహిస్తూ మండలంలో ముందంజలో ఉన్నారని తెలిపారు. కార్యదర్శి నాగేశ్వరరావును పెదకళ్లేపల్లి సర్పంచ్ అరజా సంధ్యారాణి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, ఈవోపీఆర్డీ కేటీ సుందరి సత్కరించారు.

సబ్సిడీపై యంత్ర పరికరాలు

చల్లపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి అవసరమైన ట్రాక్టర్ పనిముట్లు, స్ప్రేయర్లు సబ్సిడీపై అంద జేస్తున్నామని మండల వ్యవసాయాధికారి జి.సాయి సింధు తెలిపారు. అవసరమైన వారు రైతు సేవా కేంద్రం ద్వారా వ్యవసాయ సహాయకుల వద్ద దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు ప్రధానోపాధ్యాయులు సహకరించాలి



మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి సాల్మన్‌రాజు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు సహకరించాలని జిల్లా ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పి.బి.సాల్మన్‌రాజు కోరారు. సోమవారం లేడీయాంప్థిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులు ఇస్తున్నామన్నారు. ఈ ఏడాది నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారని, ఎంసెట్ మెటీరియల్ ఉచితంగా ఇస్తున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ సుందరలక్ష్మి పాల్గొన్నారు.

నిస్వార్థనేత అంబటి బ్రాహ్మణయ్య



ఉల్లిపాలెం వారధి వద్ద బ్రాహ్మణయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంబటి శ్రీహరిప్రసాద్

కోడూరు/నాగాయలంక/అవనిగడ్డ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే అంబటి బ్రాహ్మణయ్య నిస్వార్థనేత అని పలువురు కొనియాడారు. బ్రాహ్మణయ్య వర్థంతి సందర్భంగా ఉల్లిపాలెం అంబటి బ్రాహ్మణయ్య వారధి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఆయన తనయుడు మాజీ ఎమ్మెల్యే అంబటి శ్రీహరి ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. నాగాయలంక పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న అంబటి బ్రాహ్మణయ్య విగ్రహానికి టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, కూటమి నాయకులతో కలిసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వైసీపీ నేతలతో కలసి పూలమాలలు వేశారు. అవనిగడ్డలో దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు నేతృత్వంలో నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మండవ బాలవర్ధిరావు, పార్టీ కోడూరు మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావులు బ్రాహ్మణయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. పంచాయతీ బోర్డు సభ్యుడి నుంచి పార్లమెంట్ సభ్యుడిగా ఎదిగి ఈ ప్రాంత అభివృద్ధి కోసం విశేష కృషి చేసిన గొప్ప వ్యక్తి బ్రాహ్మణయ్య అని కొనియాడారు. బండే రాఘవ, మండలి రామ్మోహనరావు, కూరపాటి శ్రీనివాసరావు, పిల్లి మల్లికార్జునరావు, అప్పికట్ల రవీంద్రబాబు, షేక్ బాబావలి, కోట సాయి, కొల్లూరి ఇమ్మానియేలు, వాసు తదితరులు పాల్గొన్నారు.

కె.కొత్తపాలెం పంచాయతీ కార్యదర్శిగా చంద్రశేఖరరావు

మోపిదేవి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కె.కొత్తపాలెం పంచాయతీ కార్యదర్శిగా కె.చంద్రశేఖరరావు సోమవారం విధుల్లో చేరారు. కంకిపాడు మండలం కోలవెన్ను పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికొచ్చారు.

బకాయిలు చెల్లించాలి

కోడూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పోలా బత్తిన మోహనరావు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని విశ్వనాథపల్లి, పిట్టలంక, సాలెంపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించి ఉపాధి కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొప్పనాతి తాతయ్య తదితరులు పాల్గొన్నారు.